యువ చోరులు

బొమ్మిడి అచ్చారావు

శేఠ్ మనీలాల్ బ్యాంక్ నించి బయటికొచ్చాడు. సూట్ కేసు నోట్లకట్టలతో బరువుగా వుంది.

అంబాసిడర్ కారును సమీపించి డోర్ తెరిచి లోపల కూచున్నాడు—సూట్ కేసును సీటుమీద పెట్టి డోర్ లోపల్నుంచి లాక్ చేసి డ్రైవింగ్ సీట్లోకి జరిగాడు.

మనీలాల్ కి స్వయంగా డ్రైవింగ్ చేసుకోవటం అలవాటు. అందునా డబ్బు విషయంలో బ్యాంక్ కు వెళ్ళేటపుడు డ్రైవర్ ని తన వెంట తీసుకువెళ్ళడు.

ఈ రోజు కూడా అలాగే డబ్బు 'డ్రా' చెయ్యటానికి వెళ్తూ డ్రైవర్ ని ఇంటికి పంపేశాడు.

ఇగ్నిషన్ కీ తిప్పి కారు స్టార్టు చేశాడు. కారు మెత్తగా ముందుకు దూకింది. ఊరుకి చివరగా అధునాతనంగా నాల్గంతస్తుల మేడ కట్టుకున్నాడు మనీలాల్. నిత్యం ఆ ఇంటిని ఇద్దరు గూర్ఖాలు మూడు ఆల్సేషియను

కుక్కలు కనిపెట్టుకొని వుంటాయి. మనీలాల్ కుటుంబ సభ్యులు తప్ప మరెవరూ గేటు దాటి లోపలి కడుగు పెట్ట లేరు.

నిర్మానుష్యంగా వున్న తారురోడ్డుమీద జర్రున జారు తోంది కొత్త అంబాసిడర్.

సరిగ్గా అప్పుడే మనీలాల్ మెడదగ్గర చల్లటి వస్తువు ఏదో గుచ్చుకుంది. చివ్వున తల తిప్పబోయి వెనకనించి వినిపించిన కర్కశమైన హెచ్చరికకు కట్టుబడిపోయి స్థాణువులా కూచుండిపోయాడు.

"కారు పక్కకితీసి ఆపెయ్యి—" అన్నది ఆ గొంతు మళ్ళీ.

మనీలాల్ చేతులు అప్రయత్నంగా స్టీరింగ్‌ని కుడి వైపుకి తిప్పాయి. అక్కడ దారి విడిపోయి కంకరరోడ్డు తగిలింది. పొలాలకి, తోటలకి దారితీసే ఎర్ర కంకరరోడ్డు అది. చుట్టూ జీడిమామిడిచెట్లు గుబురుగా పెరిగివున్నాయి. ఎక్కడా మనుష్యసంచారం లేదు.

"ఎ.... ఎవరు.... కౌన్ హో తుమ్?" వచ్చీరాని తెలుగు లోను, హిందీలోను అడిగాడు మనీలాల్. అతని గొంతు నూతిలోంచి పలికినట్టుగా వుంది. తొడుక్కున్న మల్లె పువ్వులాంటి లాల్చీ చెమటతో తడిసి ముద్దయిపోయి పచ్చని అతని ఒంటిరంగుని బహిర్గతం చేస్తోంది. మనిషి నిలువెల్లా ఒణికిపోతున్నాడు.

"మే మెవరమో నీ కనవసరం. ఆ సూట్‌కేసిలా ఇవ్వు" అన్నది మరో గొంతు.

ఒకరికన్నా ఎక్కువే వున్నారు దుండగులు — అనుకున్నాడు మనీలాల్. అతని చేతులు అప్రయత్నంగా

డబ్బున్న సూట్ కేసిస్ అప్యాయంగా ఆత్రంగా గుండెల కదుముకున్నాయి. పసిపిల్లవాడ్ని తన నుంచి దూరం చేస్తుంటే విలవిల్లాడే తల్లిలా, గద్ద బారినుంచి తన పిల్లల్ని పొదిలి కాపాడుకునే కోడిలా — వున్నాడు మనీలాల్ ఆ సమయంలో.

"మిస్టర్ మనీలాల్, నీ ప్రాణాలకన్నా ఆ డబ్బు ఎక్కువ కాదని నీకూ తెలుసు. ఎందుకనవసరంగా నిండు ప్రాణాల్ని పోగొట్టుకుంటావు. నీ నుంచి నయానకాకున్నా భయాన, ప్రాణాలు తీసి మరీ సూట్ కేసు పట్టుకెళ్ళగలం....కమాన్, ఇలా ఇవ్వు" మొదటి గొంతు హెచ్చరించింది.

మనీలాల్ సూట్ కేసును మరింతగా కరుచుకుపోయాడు.

అంతే! మరుక్షణం అతని నెత్తిమీద బలమైన దెబ్బ పడింది — అది పిస్తోలుమడమ దెబ్బ. మరి కిక్కురు మనకుండా సీట్లో ఒరిగిపోయాడు. సూట్ కేసు మనీలాల్ పొట్టకింది నుంచి రెండో వ్యక్తి గుంజుకున్నాడు.

మరుక్షణం వాళ్ళిద్దరూ మనీలాల్ ని కిందికి తోసేసి కారు స్టార్టు చేసుకుని మళ్ళీ వచ్చినదారినే వెనక్కు బయల్దేరారు.

జంక్షన్ వరకు వచ్చాక కారును రోడ్డు పక్కగా వదిలేసి కిందికి దిగారు. పదిగజాలు నడిచాక ఖాళీ ఆటో వారి కెదురొచ్చింది. ఆటో ఎక్కి కూర్చున్నారు.

ఎక్కడికి పోవాలింది చెప్పారు.

ఆటో వేగం పుంజుకుంది.

2

"నా భార్యకి ప్రాణంమీది కొచ్చిందండయ్యా! ఓ అయిదువంద లిప్పించండి" అన్నాడు ఆ యువకుడు.

గురవయ్యశెట్టి చత్వారం కళ్ళజోడు కింది నుంచి అతన్ని పరీక్షగా చూసి చెయ్యి చాపాడు.

"ఏటండయ్యా...." అన్నాడా యువకుడు అమాయకంగా చూస్తూ.

"తాకట్టు పెట్టడాని కేం తెచ్చావు....?" అడిగాడు శెట్టి.

"మా దగ్గరేటుంటాది తాకట్టు పెట్టడానికి? నోట్రాయండి, ఏలిముద్ర వేస్తాను."

"నీ వేలిముద్ర లెవడిక్కావాలి? పత్రాలేమన్నా వుంటే పట్రా. కుదవబెట్టుకుని డబ్బిస్తాను."

ఆ యువకుడు తల అడ్డంగా తిప్పాడు.

గురవయ్యశెట్టి నిర్లక్ష్యంగా చూశాడతనివైపు. "వెళ్ళెళ్ళు! పొద్దున్నే గొప్ప బేరం దొరికింది" అన్నాడు చీదరించుకుంటూ.

ఆ యువకుడు నిరాశగా వెనుతిరిగి వెళ్ళిపోయాడు.

గురువయ్యశెట్టి విసుగ్గా ఐరన్ సేఫ్ వైపు తిరిగి తెరుస్తుండగా ఇద్దరు యువకులు లోనికొచ్చారు.

గురవయ్యశెట్టి వాళ్ళవైపు ప్రశ్నార్థకంగా చూశాడు. ఓ యువకుడు పొడవుగా బలంగా వున్నాడు. రెండో అతను పొట్టిగా బక్కపలచగా వున్నాడు.

"ఏం కావాలి?" అడిగాడు గురవయ్యశెట్టి.

"డబ్బు!" అన్నాడు పొడవు యువకుడు.

"ఎంత?" అడిగాడు శెట్టి.

"పది లక్షలు" అన్నాడు పొట్టి యువకుడు. గుర

వయ్య శెట్టి నిర్ఘాంతపోయి చూశాడు వాళ్ళిద్దరివైపు.

"ఏమిటీ, పది....ల .. క్ష....లా?" అన్నాడు ఒత్తి పలుకుతూ.

"కాకపోతే వేలనుకున్నావా?"

"అంత డబ్బు నా దగ్గరెక్కడిది? ఏదో చిన్న మొత్తాలతో వడ్డీవ్యాపారం చేసుకుంటున్నాను."

"ఏదో చిన్న మొత్తాలా?....కాని వసూలు చేసే వడ్డీ ఇప్పటికన్ని లక్షలుండి వుంటుందో...."

"అదేం మాట! ఇచ్చేది వందల్లో అయితే అసలుకన్న వడ్డీ యెక్కువొస్తుందా?"

"ఎందుకు రాదు!?....అసలు నువ్వు సంపాదించిందంతా అసలు కన్న వడ్డీయే యెక్కువ కదా! లేకుండా ఇన్ని కోట్లు గడించావా?"

"ఇదిగో అబ్బాయ్, మర్యాద లేకుండా అలా నువ్వు నువ్వంటూ మాట్లాడతారేమిటి? నా దగ్గర పది రూపాయలు కూడా లేవు. వెళ్ళండి, వెళ్ళండి" విసుగ్గా చూశాడు కురవయ్య శెట్టి.

"పదిరూపాయలు నువ్విచ్చినా మాకొద్దు. చూడూ, మేమడిగింది మర్యాదగా ఇచ్చిపంపు, లేకుంటే...."

"లేకుంటే....!?" అంటూ విసురుగా అనబోయి చటుక్కున ఆగిపోయాడు శెట్టి.

పొడవుగా వున్న యువకుడి చేతిలో నిగనిగ మెరుస్తూ అతనివైపే గురిపెట్టబడి వున్న రివాల్వర్ నోటి నుంచి మాట రానివ్వలేదు.

"ఏంటయ్యా, ఏంటీ దౌర్జన్యం?...." మేకపోతు గాంభీర్యంతో దబాయించాడు.

ఎప్పుడు చూసేశాడో, పొట్టి యువకుడు, వీధి

తలుపుమూసి గడియ పెట్టేశాడు.

గురవయ్య శెట్టి ఇంట్లోనే వ్యాపారం చేస్తున్నాడు. ముందుగదిలో వ్యాపారం, వెనకగదుల్లో కాపరం వుంటున్నాడు. అతనికి భార్యా ఇద్దరు కూతుళ్ళు వున్నారు. కూతుళ్ళకి పెళ్ళిళ్ళు చేసి పంపేశాడు.

అతని భార్య క్రితంరోజే చిన్నకూతుర్ని చూసిరావటానికి నెల్లూరు వెళ్ళింది. అక్కడ వరదలు రావటంవల్ల, తుఫాను తాకిడికి కూతురుంటున్న ప్రాంతం కూడా గురయ్యిందని తెలిసి ఆందోళనపడుతూ వెళ్ళింది.

శెట్టికి వ్యాపారమే లోకం. భార్య రమ్మని యెంత బతిమాలినా రావటం కుదరదని ఖచ్చితంగా చెప్పేసి పంపేశాడు.

ఇదంతా ముందుగానే తెల్సుకున్నట్టున్నారాయువకులిద్దరు. సరిగ్గా సమయం చూసుకుని వచ్చారు.

అప్పుడు సాయంత్రం ఆరుగంటలు దాటి పదినిమిషాలయింది. కస్టమర్లు వచ్చే టైం అదే! అందుకే శెట్టి ముందుగదిలో సిద్ధంగా కూచుని వున్నాడు.

“దౌర్జన్యం చెయ్యాలని మా ఉద్దేశంకాదు. మమ్మల్ని రెచ్చగొట్టకుండా డబ్బిచ్చేస్తే నీ చిటికెన వేలు కూడా ముట్టుకోకుండా అందుకుని వెళ్ళిపోతాం. నీదే ఆలస్యం!” చిన్నగా నవ్వుతూ అన్నాడు పొడవు యువకుడు.

“ఏమిటీ, ఏమిటయ్యా ఇచ్చేది? నా దగ్గరంత డబ్బెక్కడిది? ఓ వెయ్యిరూపాయలిస్తాను, తీసుకొని వెళ్ళిపొండి! అట్టే బెట్టుచేస్తే పోలీసుల్ని పిలుస్తాను, జాగ్రత్త!” బెదిరించాడు శెట్టి.

“పోలీసుల్ని పిలవటానికి నువ్వంటూ బతికివుండాలి కదా! నువ్వు ఫోన్ వైపు జరిగిన మరుక్షణం నీ చేతిలోంచి

నా రివాల్వర్‌నించి వచ్చే బుల్లెట్ దూసుకుపోతుంది. మరో బుల్లెట్ నీ గుండెల్లో నిద్రపోతుంది. ఎందుకొచ్చిన రభసగాని, పదిలక్షలూ ఇచ్చిపంపెయ్యి బాబాయ్! అవతల బేరాలు పోతున్నాయి నీకు. తలుపులు మూసి వుంటంచూసి కష్టమర్లు వెళ్ళిపోతూ వుంటారు" పొడవు యువకుడు రివాల్వర్ ఫర్మ్‌గా పట్టుకుని గురిచూసుకుంటూ అన్నాడు.

గురవయ్యశెట్టి ముఖంలో ప్రేతకళ వచ్చేసింది. పదివేలైనా కాదు—పదిలక్షలు! యెన్నాళ్ళు సంపాదిస్తే వస్తుంది? ఎంతమందిని నిలువునా ముంచేస్తే సంపాదించగలడు? రూపాయి రూపాయి వడ్డీరూపంలోకూడ పెట్టింది యీ దోపిడీ రాస్కెల్స్‌కి యివ్వటానికా? ఉత్త పుణ్యానికెందుకు వదులుకోవాలి అంత డబ్బు?

గురవయ్యశెట్టిలోని వ్యాపారి అందుకు ససేమిరా అంగీకరించలేదు.

"శెట్టీ, అనవసరంగా కాలయాపన చేస్తున్నావు? మా చేత హత్య చేయించకు" ఈసారి పొట్టి యువకుడు హెచ్చరించాడు.

శెట్టిలో అప్పటికీ చలనంలేదు. పొడవు యువకుడు సేఫ్టీకాచ్ తప్పించాడు. రివాల్వర్‌నించి బుల్లెట్ రిలీజయింది. అది సూటిగాపోయి ఐరన్ సేఫ్‌కి తగిలింది. ఆ గుండు తన గుండెల్లోనే దూరినట్టు కెవ్వుమన్నాడు గురవయ్యశెట్టి.

పొడవు యువకుడు పకపకా నవ్వాడు. "ఈసారి నా గురి వృథాపోదు. ఇది కేవలం శాంపిల్‌గా పక్కకు కాల్చాను. కమాన్, సేఫ్ తెరిచి పదిలక్షలు యెంచి ఈ సూట్‌కేస్‌లో సర్ది మూసెయ్యి!" తమవెంట తెచ్చిన

వి.ఐ.పి. సూట్ కేస్ గురవయ్యశెట్టి ముందుకు తోశాడు పొట్టి యువకుడు.

గురవయ్యశెట్టి శిలావిగ్రహంలా కదల్లేదు. యువకులిద్దర్లోను సహనం నశించింది. గురవయ్యశెట్టి ప్రాణానికి, డబ్బుకి లంకె అని అర్థంచేసుకున్నారు.

పొట్టి యువకుడు శెట్టిని సమీపించాడు. ఊహించని వేగంతో తలతో పొట్టేలు కుమ్మినట్టు గురవయ్యశెట్టి పొట్టలో కుమ్మాడు. అంతే! విరుచుకుపడిపోయాడు శెట్టి. అతన్ని లేవకుండా మోచేతుల్తో డొక్కల్లోనూ, ముఖం మీద పొడిచాడు. శెట్టి అరవటానిక్కూడా ఓపిక నశించి కుప్పకూలిపోయాడు.

మరుక్షణం ఐరన్ సేఫ్ మీదికి లంఘించాడు పొట్టి యువకుడు. అంతిక్రితమే సేఫ్ తెరవటానికి సిద్ధంగా తాళాలు పట్టుకుని ఉన్న శెట్టి వీళ్ళను చూసి బైండు పుస్తకాల చాటున దాచేశాడు. అయితే పొట్టి యువకుడి దృష్టిని దాటిపోలేదా చర్య.

బైండు పుస్తకాల వెనకనించి తాళాలు పైకితీసి క్షణాల్లో దాన్ని తెరిచాడు పొట్టి యువకుడు.

అరల్లోని నోట్లకట్టలు పైకితీశాడు. ఇంకా బంగారు ఆభరణాలు కూడా వున్నాయందులో. వాటిజోలికి పోలేదు.

"నోట్లకట్టలు రెండు లక్షలు కూడా లేవు" అన్నాడు పొట్టియువకుడు లెక్కించి.

"అయితే తక్కిన సొమ్ము ఇంటి లోపల సేఫ్లో దాచాడేమో....!"

ఇద్దరు లోపలి గదిలోకి వెళ్లారు. లోపల నాలుగ్గదులున్నాయి. పడగ్గదిలో మరో ఐరన్ సేఫ్ వుంది.

తమ దగ్గరున్న తాళంచెవుల గుత్తినుంచి ఒక టొకటిగా తాళంతీసి ప్రయత్నించాడు, పొట్టి యువకుడు. ఓ తాళం సరిపోయింది. తలుపు తెరిచాడు. లోపల మరో అరవుంది. దాన్ని ఇంకో తాళంతో తెరిచాడు.

కళ్ళు చెదిరిపోయాయి. లోపల ఏమాత్రం జాగా లేకుండా కట్టలుగా కరెన్సీ పేర్చబడుంది. అందులోనించి డబ్బు ఎంచి తీశాడు పొట్టి యువకుడు. కేవలం ఎనిమిది లక్షలు మాత్రం తీసి సూట్ కేస్‌లో సర్దాడు. తర్వాత ఐరన్ సేఫ్ మూసేశాడు. ఇంకా నోట్లకట్టలున్నాయి. కాని వాటిని ముట్టలేదు.

సేఫ్ లోపల పైన తన వేలిముద్రలు పడకుండా ముందే తొడుక్కున్న గ్లౌవ్స్‌ని తీసి సూట్ కేస్‌లో పడేసి మూత పెట్టేశాడు.

ఆ తర్వాత ఇద్దరు ముందుగదిలోకి వచ్చారు. చలనం లేకుండా పడున్నాడు గురవయ్యశెట్టి.

వీధి తలుపు తెరవబోతూ కీహోల్ లోనించి బయటికి చూశాడు పొడుగు యువకుడు.

బయట యెవరో నలుగురైదుగురు మనుషులు నిల్చుని ఉన్నారు. శెట్టి దగ్గర అప్పుకోసం వచ్చిన కస్టమర్స్‌ని గ్రహించాడతను. ప్రశ్నార్థకంగా పొట్టి యువకుడివైపు చూశాడు.

"వెనకవైపునించి వెళ్దాం" అన్నాడు తను కూడా కీహోల్ లోనించి చూసిన పొట్టి యువకుడు.

ఇద్దరు చకచక గదులన్నీ దాటుకుని దొడ్డివైపు వెళ్ళారు. దొడ్డికుమ్మం తెరిచాడు పొడుగు యువకుడు. చేతిలోని రివాల్వర్ పాంటుజేబులో పెట్టుకున్నాడు.

సందులోకి తిరుచుకుంది దొడ్డిమార్గం. ఓసారి సందులోకి చూశారిద్దరు. ఎవరూ తమని గమనించటంలేదని నిర్ధారణ చేసుకున్నాక సందులోకి ప్రవేశించారు.

చకచక నడుచుకుంటూ సందుచివరికొచ్చారు. అంతదాకా దూరంగా ఆగివున్న మారుతీకారొకటి వారిముందుకొచ్చి ఆగింది. డ్రైవింగ్ సీట్లో ఉన్న వ్యక్తి వాళ్ళ వంక నవ్వుతూ చూశాడు.

సూట్ కేస్ తో బాటు వాళ్ళిద్దరు వెనక సీట్లలో కూచున్నారు.

మరుక్షణం మారుతీకారు రయిటో వేగంగా దూసుకు పోయింది.

3

"కిరణ్ ఇప్పటికి నగరంలో తొమ్మిది దోపిడీలు జరిగాయి. అన్నీ మేజర్ తెఫ్ట్స్. మొత్తం రాబరీ తొంభై లక్షలు. ప్రతిసారీ పదిలక్షల చొప్పున చాలా కాల్ క్యులేటెడ్ గా దోపిడీలు జరిగాయి. ఒకే ముఠా జరిపినట్టుగా అర్థమయ్యింది.

చిత్రమేమిటంటే ప్రతి దోపిడీలోను ఇద్దరు వ్యక్తులే ఉండటం, వాళ్ళిద్దరు యువకులు కావటం, తమ ముఖ కవళికల్ని దాచుకోవటానికి వాళ్ళు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోకపోవటం ముఖ్యాంశాలు.

ఒకచోట దోపిడీ చేసిన జంట మరోచోట చెయ్యలేదు. అంటే మొత్తం తొమ్మిది జంటలు—అంటే పద్ధెనిమిది మంది యువకులు ఈ రాబరీస్ కండక్టుచేశారు. ఇంకా యెంతమందున్నారో ఎన్ని దోపిడీలు టార్గెట్ గా పెట్టుకున్నారో అనూహ్యంగా ఉంది."

గుక్కతిప్పుకోకుండా చెప్పేసి, టేబిల్ మీదున్న

గ్లాసెడు నీళ్ళు గటగట తాగేశాడు క్రైం బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్.

అతని కెదురుగా కూచుని అంతవరకు అతను చెప్పిన ప్రతి విషయాన్ని శ్రద్ధగా విన్న డిటెక్టివ్ కిరణ్ కుర్చీలో వెనక్కి వాలి కప్పువైపు కాసేపు చూస్తూ ఉండి పోయాడు.

తర్వాత శ్రీనివాస్ వైపు తిరిగి "అతి త్వరలో నీకు మరో రాబరీ గురించిన మెసేజ్ రావచ్చు" అని కిరణ్ అంటుండగానే ఫోన్ గణగణ మోగింది.

శ్రీనివాస్ రిసీవరెత్తి "హల్లో," అన్నాడు. కాసేపు అవతలివైపునుంచి వస్తూన్న మెసేజ్ విన్నాడు. అతని ముఖం తెల్లగా పాలిపోయింది.

"ఏదో రాబరీ జరిగిపోయింది. సరిగ్గా పదిలక్షలు— హార్డ్ క్యాష్. ఇద్దరే యువకులు ఈసారి కూడా దోపిడీ చేశారు" చెప్పాడు శ్రీనివాస్ ఫోన్ క్రెడిల్ చేస్తూ.

"ఇదివరకటి కేసుల్లోలాగానే ఇప్పుడు కూడా యెలాంటి రక్తపాతం జరగలేదు. కేవలం అతన్ని బెదిరించి పదిలక్షలు తీసుకుపోయారు. అవునా?"

"అవును."

"ఇప్పటికి ఇరవైమంది యువకులు రంగంమీదికొచ్చారు. కోటి రూపాయలు కలెక్టు చేశారు."

శ్రీనివాస్ తలూపాడు "అయితే, కోటిరూపాయలు సంపాదించటం టార్గెట్ గా పెట్టుకున్నారంటావా?" గాడు.

"ఈ దేశంలో కోటీశ్వరులు చాలామంది ఉన్నారు" అన్నాడు కిరణ్ నవ్వుతూ.

శ్రీనివాస్ కర్థమయ్యింది.

"అయితే, వీళ్ళ ఆట కట్టించేదెలా? ఇప్పటికే కమీషనర్ లెవల్ నించి హయ్యర్ అథారిటీస్ మమ్మల్ని మందలిస్తూన్నారు. మా అసమర్థకని తీవ్రంగా దూషిస్తూన్నారు. ఇప్పటివరకు జరిగిన తొమ్మిది దోపిడీల్లోను ఒక్క దొంగను కూడా పట్టుకోలేకపోయినందుకు మమ్మల్ని సామూహికంగా సస్పెండ్ చేస్తామంటున్నారు. ఈ క్లిష్టపరిస్థితుల్లో నువ్వే మమ్మల్ని గట్టునపడెయ్యి బ్రదర్!" అంటూ ఆక్రోశించాడు.

కిరణ్ అంతవరకు జరిగిన దోపిడీల గురించిన పూర్తి వివరాలు చదవటంలో మునిగిపోయాడు. అన్నీ ప్రీప్లాన్డ్ గానే జరిగాయి. దోపిడీకి గురైన కోటీశ్వరు లందరు అక్రమార్జన కలవాటుపడినవారే! వాళ్ళు సామాన్యుల జోలికి, ఓ మాదిరి ధనవంతుల జోలికి పోలేదు. ఎవర్నీ హత్య చెయ్యలేదు. ఎవరిమీదా కత్తి తియ్యలేదు. ఎవరి నుంచీ పది లక్షలకు తక్కువ, యెక్కువ తీసుకోలేదు.

వీళ్ళు యెక్కడ్నుంచో వచ్చినవాళ్ళు కాదు. లోకల్ గా వుంటున్నవాళ్ళు. నగరంలోని ప్రముఖుల గురించి బాగా వివరాలు తెలిసినవాళ్ళై అయుండాలి. అయితే వీళ్ళు కేవలం ధనార్జనకోసమే అయితే ప్రతీ ధనవంతుడ్ని దోచుకోవచ్చు. కాని వాళ్ళు కేవలం అన్యాయార్జితాని కలవాటుపడ్డ శ్రీమంతుల్నే యెందుకు దోచుకుంటున్నారు? దోచుకొన్న లక్షలేం చేస్తున్నారు? అసలు వీళ్ళెవరు? చదువుకున్న నిరుద్యోగులా? ఈ వ్యవస్థమీద విసిగిపోయి చివరికి అకృత్యాలకి పాల్పడుతున్నారా?

మరి వీళ్ళందరు కలసికట్టుగా ఈ దోపిడీలు చెయ్యకుండా కేవలం ఇద్దరు మాత్రమే ఎందుకు చేస్తున్నారు?

ఒకసారి కనిపించినవాళ్ళు మళ్ళీ కనిపించకుండా పకడ్బందీగా, ఎంతో అనుభవమున్న గజదొంగల్లా వీటిని నిర్వహించటం, ఒకడు కూడా ఇప్పటిదాకా పట్టుబడక పోవటం చూస్తూంటే, వీళ్ళు దుర్భేద్యమైన వ్యూహం పన్ని దాన్ని అక్షరాలా అమలుజరుపుతున్నారని తెలుస్తోంది.

వీళ్ళ స్థావరాన్ని కనిపెట్టగలిగితే యీ దోపిడీలని తక్షణం అరికట్టవచ్చు. కాని అది సాధ్యమయ్యే పనేనా? కనీసం యే ఒక్కడినయినా రెడ్ హేండెడ్ గా పట్టుకోగలిగితే చాలు! ముఠానంతా వలపన్ని పట్టెయ్యవచ్చు.

కాని వాళ్ళిప్పటిదాకా చిన్న ఆధారం కూడా వదల్లేదు. లేదా, పోలీసులు యిలాంటి 'క్లూ' సాధించలేక పోయారని చెప్పాలి.

కిరణ్ తల విదిలించాడు.

ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ ఆశగా, ఆత్రంగా, కిరణ్ ముఖంలోకి చూస్తూన్నాడు. అతని నోటినుంచి యిలాంటి మాట వెలువడుతుందోనని తదేకంగా ఒళ్ళంతా చెవులు చేసుకుని సిద్ధంగా వున్నాడు.

కిరణ్ లేచి నిల్చుని, "ఏదో విక్టిమ్ని వెంటనే కల్సుకుంటే మనకేదయినా అనుకూల సమాచారం దొరకవచ్చు. అడ్రసు నోట్ చేశావు కదూ.........!?" అన్నాడు.

శ్రీనివాస్ తలూపి, "నేనూ అదే చెప్పాలనుకొంటున్నాను. వెళదామా?" అన్నాడు హేట్ నెత్తిన పెట్టుకుంటూ.

"లెటజ్ ప్రొసీడ్!" అన్నాడు కిరణ్.

మరో రెండునిమిషాల తర్వాత కిరణ్, శ్రీనివాస్లని

మోసుకుంటూ దిల్‌షుక్‌నగర్ వైపు దూసుకుపోయింది పోలీసుజీప్.

4

అది నాలుగంతస్థుల భవనం. డబ్బునే ఇటుకలుగా పేర్చి కట్టరా అన్నంత వైభవంగా ఠీవిగా, గర్వంగా వెలిగిపోతోంది. చుట్టూ రెండు నిలువుల ప్రహరీ జైలు గోడల్ని తలపింపచేస్తోంది.

గేటునుంచి దాదాపు వందగజాల దూరంవరకు పూల మొక్కలు బాట కిరువైపులా స్వాగతం పలుకుతున్నట్టు గాలికి తలలూపుతున్నాయి. ప్రహారీ లోపల ఆవరణ నిండా రకరకాల పండ్లచెట్లు కన్నులపండువ చేస్తున్నాయి.

ఆ భవనం యజమాని నగరంలోకెల్లా పెద్ద బిజినెస్ మాగ్నెట్ రాజానాయుడు. అతనికి రెండు సినిమా థియేటర్లు, కొన్ని ప్రముఖ కంపెనీల్లో షేర్లు ఉన్నాయి. అవిగాక నగరశివార్లలో అక్రమంగా ఆక్రమణ చేసిన బంజరుభూము లున్నాయి. ఇళ్ళ స్థలాలుగా వాటికి ప్రస్తుతం విపరీతమయిన ధర పలుకుతోంది. అవి చాల వన్నట్టు ప్రభుత్వం బలహీనవర్గాల కోసమని పట్టాలిచ్చిన నివేశన స్థలాలను కారు చవగ్గా వాళ్ళనుంచి కొనేసి లోపాయికారీగా ఉద్యోగస్థుల కమ్మేశాడు — నాయుడు.

పై స్థిరాస్తులతో బాటు కొన్ని వందల తులాల బంగారము, యెన్నో లక్షల బ్లాక్‌మనీ అతని ఖజానాలో మూలుగుతోంది.

కిరణ్, శ్రీనివాసులు వెళ్ళిన సమయానికి రాజా నాయుడు తన విశాలమయిన తోటలోని లాన్స్‌లో

అశోకవనంలో సీతమ్మవారిలా దిగాలుపడిపోయి సర్వమూ కోల్పోయినవాడిలా కూచున్నాడు. అతని వాలకం చూస్తూంటే అతి దగ్గర బంధువును పోగొట్టుకున్నవాడిలా వున్నాడు.

అప్పుడు సమయము సాయంత్రం నాలు గ్గంట లయ్యింది.

"చోరీ యెలా జరిగిందో కాస్త వివరిస్తారా?" అనడిగాడు కిరణ్, పరిచయాలయ్యాక.

రాజా నారాయుడు గొంతు సవరించుకొని చెప్ప సాగాడు:

"నేను మధ్యాహ్నం భోజనం చేసి విశ్రమించుచుండగా యెవరో యిద్దరు యువకులు నా దర్శనం కోసం వచ్చారని మా నౌకరు చెప్పాడు. వాళ్ళని సాయంత్రము రమ్మనమని కబురుచేశాను నౌకరుతో. అయితే ఆ పని చాలా అర్జంటని, కేవలము పదినిమిషాల్లో తమ పని పూర్తిచేసుకుపోతామని తిరుగుకబురెట్టారు' ఇక చేసేది లేక విశ్రాంతి మానుకుని లేచాను—వాళ్ళని పంపమని చెప్పి.

"వాళ్ళు నేను విజిటర్స్ రూమ్‌లోకి వచ్చే లోపల సరాసరి నా పడగ్గదిలోకే వచ్చేశారు. అకస్మాత్తుగా తలుపులు మూసేశారు. వాళ్ళిద్దరి చేతుల్లోను రెండు రివాల్వర్స్ ఉన్నాయి. అవి రెండూ సూటిగా నాకే గురి చేయబడి వున్నాయి. కదిలితే కాల్చేస్తామని బెదిరించారు. నేను భయపడి నోరు మెదపలేదు. నా మంచంమీద పరుపుకింద లైసెన్సున్న నా రివాల్వర్ ఉంటుంది. దాన్నందుకోవాలనుకున్నాను. కాని కాలు కదపనివ్వలేదు వాళ్ళు.

"నా చేతుల్తోనే నా పడగ్గదిలో వున్న ఐరన్ సేఫ్ తెరిపించారు. అందులోంచి పదిలక్షలు పైకి తీయించారు. తమవెంట తెచ్చిన సూట్‌కేసులో నాచేతే డబ్బుకట్టలు పేర్పించారు. ఆ తర్వాత నా నోట్లో గుడ్డలు కుక్కి, నా చేతులు మంచంకోడుకు కట్టేసి దర్జాగా వెళ్ళిపోయారు. ఆ తర్వాత వచ్చిన నౌఖర్ల సాయంతో బంధవిముక్తుడనై మీకు ఫోన్ చేశాను" ముగించాడు రాజానాయుడు.

కిరణ్ ఆయనవంక సూటిగా చూశాడు.

మదపుటేనుగులా పోతరించి వున్నాడు నాయుడు. మెళ్ళో బంగారు చెయిన్ వేళ్ళాడుతోంది. చేతివేళ్ళకు వజ్రపు టుంగరాలు ధగధగ మెరుస్తూన్నాయి.

అతన్ని, అతని ఇంటి వైభవాన్ని చూసినవాళ్ళు లక్ష్మీదేవిని అతను తన ఇల్లు కదలకుండా బంధించి వుంచాడనిపిస్తుంది. అలాంటివాడికి పదిలక్షలు ఓ లెక్క కాదు. కాని డబ్బు సంపాదించేవాడికి పదిపైసలు పోయినా తట్టుకోలేడు. అదికూడా పెద్ద నష్టంగానే భావిస్తాడు. నాయుడు ఆ కోవకి చెందినవాడే.

"ఒకసారిగా పదిలక్షల కేష్ ఇంట్లో ఎందుకుంచారు? బ్యాంకులు, లాకర్లు ఉన్నాయి కదా....!?" అడిగాడు కిరణ్.

నాయుడు తడబాటును కప్పిపుచ్చుకోవటానికి వ్యర్థప్రయత్నం చేశాడు. "నా పొలం, తోటలు అమ్మి అంతక్రితం రోజే క్యాష్ తెచ్చి సేఫ్‌లో పెట్టాను...." అన్నాడు.

"అంత అర్జంటుగా తోట లెందు కమ్మవలసి వచ్చింది?...."

"ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ సమీపంలో కొత్తగా ఓ

థియేటర్ కట్టబోతున్నాను. స్థలం కొనటానికి, ఎక్విప్‌మెంటుకి ఆర్డరివ్వటానికి క్యాష్ అవసరపడింది. డబ్బు సర్దుబాటు కాలేదు. పొలం అమ్మక తప్పలేదు." చెప్పేసి, తేలిగ్గా ఊపిరి పీల్చుకున్నాడు.

అతను చెప్పేది నిజం కాదని కిరణ్‌కి తెలిసిపోతూనే వుంది. అయినా తన ముఖంలో ఎలాంటి భావప్రకటన చెయ్యకుండా తల పంకించి వూరుకున్నాడు.

"ఐరన్ సేఫ్ వుండే గది చూపిస్తారా?" అడిగాడు కిరణ్.

నాయుడు భారంగా లేచాడు. శ్రీనివాస్, కిరణ్‌లు ఆయన్ని అనుసరించారు.

కిరణ్, శ్రీనివాసుల్ని తన పడగ్గదిలోకి తీసుకు వెళ్ళాడు నాయుడు. చాలా వైభవంగా వుందా గది. డెకోలాంతో తయారుచేయబడ్డ అల్మయిరాలు, గాజు తలుపులతో అద్దాల మేడలా వుందా గది. చుట్టూ నిలువుటద్దాలు—అరవైలో పడ్డ నాయుడి రసికత్వాన్ని చాటుతున్నాయి.

నాయుడు బెడ్‌కి తలవేపున వుంది ప్రత్యేకంగా తయారుచేయించిన బ్రహ్మాండమైన ఐరన్ సేఫ్. సగం వరకు గోడలో తాపటం చేయబడి వుంది.

మంచాని కివతలగా నేలమీద పడున్న ఓ ఐడింటిటీ కార్డు కిరణ్ దృష్టి నాకర్షించింది. వంగి దాన్నందుకున్నాడు.

నాయుడు సేఫ్‌ను చూపించి వెనుతిరిగాడు. "మీ ఇంట్లో ఇన్‌కంటాక్స్‌లో పని చేసేవాళ్ళెవరయినా వున్నారా?" అడిగాడు కిరణ్.

ఊహించని ఆ ప్రశ్నవిని ఉలిక్కిపడ్డాడు నాయుడు.

“లేశ్! అందరూ బిజినెస్‌లోనే వున్నారు. ఎవరూ ఉద్యోగాలు చెయ్యటంలేదు” అన్నాడు.

“ఇందాక మీరు చెప్పిందాట్లో డబ్బు పదిలక్షలు పోవటం నిజమేగాని, మిగతా విషయాలేవీ నిజం కాదం టాను. మీరేమంటారు?” అన్నాడు కిరణ్.

నాయుడు కోపంగా చూశాడతనివంక. “ఏమిటి మీ ఉద్దేశ్యం? నేనే కావాలని కల్పించి చెప్పానంటారా?” అన్నాడు.

“అవును. ఇద్దరు యువకులు వచ్చినమాట నిజమే! కాని వాళ్ళు తాము ఇన్‌కంటాక్స్ డిపార్టుమెంటుకి చెందినవాళ్ళమని, మీ యిల్లు రైడ్ చెయ్యటాని కొచ్చా మని చెప్పారు. అయితే వాళ్ళు మీ పడగ్గదిలోకి సరాసరి రాలేదు. మీరే వాళ్ళని సగౌరవంగా ఈ గదిలోకి తీసుకువచ్చారు. వాళ్ళకు డబ్బు ఆశ చూపారు. ఎన్నో లొసుగులు, బ్లాక్‌మనీ నిల్వలు వున్న మీ ఇంటిమీద ఇన్‌కంటాక్సువాళ్ళు దాడిచేస్తే ఎన్నో లక్షలు టాక్స్ కింద కట్టాల్సి వుంటుంది. అందుకే వాళ్ళకో అరలక్షో, లక్షో ఆశ చూపించి నోరు నొక్కెయ్యాలనుకున్నారు.

“వాళ్ళు మెత్తబడినట్టు నటించారు. మీరు డబ్బు కోసం ఐరన్ సేఫ్ తెరవగానే మీ మీద పడి రివాల్వర్ తోనో, కత్తితోనో బెదిరించి మిమ్మల్ని బంధించి, మీ కళ్ళముందే సూట్‌కేసులో పదిలక్షలు సర్దుకుని వెళ్ళి పోయారు. ఐరన్ సేఫ్‌లో వున్న నగలుగాని, విలువయిన పత్రాలు, బాండ్స్‌గాని వాళ్ళేమీ ముట్టుకోలేదు— అవునా?” సూటిగా నాయుడు కళ్ళలోకి గుచ్చి చూస్తూ అన్నాడు కిరణ్.

నాయుడి ఒళ్ళంతా చెమటతో తడిసిపోయింది. కోపం

తగ్గిపోయి దాని స్థానంలో బెరుకు, నిజం తెలిసిపోయిందన్న ఆందోళన చోటు చేసుకున్నాయి.

"మీరు చెప్పేది నిజంకాదు" అన్నాడు బలహీనంగా. అతని గొంతులో స్పష్టత, ఖండన లేవు. ఏదో అనాలని అన్నట్టుంది.

"నాయుడుగారూ! మా దగ్గర నిజం దాచటంవల్ల లాభంలేదు. మేము మీ కే విధంగాను సహాయపడలేం. మీరు మాతో నిజాయితీగా సహకరిస్తే నే దొంగల్ని పట్టి మీ డబ్బు మీకు వాపసు చెయ్యగలం....ఇంత పకడ్బందీగా కోటలా కట్టిన యింట్లోకి సామాన్యుడు ప్రవేశించలేడు. అడుగడుగునా నౌఖర్లున్నారు. కుక్కలున్నాయి. వాళ్ళెంతో బలమైన కారణం చూపిస్తేనే గాని గేటు కూడా దాటనిచ్చి వుండడు మీ గూర్ఖా.

లోపలికొచ్చాక అంత చనువుగా ధైర్యంగా మీ పడగ్గదిలోకి ప్రవేశించే ధైర్యంకూడా ఎవరికీ వుండదు మీ అంతట మీరు తీసుకువస్తే తప్ప! ఇన్ కంటాక్స్ వాళ్ళని మీరు పూర్తిగా నమ్మింతర్వాతే వాళ్ళ కి ఇంట్లోనూ, మీ పడగ్గదిలోనూ ప్రవేశం దొరికింది....ఏమై రైట్?" ఉరిమినట్టుంది కిరణ్ గొంతు.

నాయుడు తలూపాడు నీరసంగా.

"వ్యాపారమన్నాక యేదో చిన్న చిన్న లొసుగులుండక తప్పదు. వాటిని కాచుకోటానికి మేం అధికారులకు చిరుతిర్లు తినిపించక తప్పదు. వారం రోజులుగా ఇన్ కంటాక్స్ వాళ్ల రైడింగ్స్ జరుగుతున్నాయి. స్పెషల్ స్క్వాడ్స్ వస్తున్నాయి. అందుకని పాతవాళ్లని తడిపినా లాభం లేక మా జాగ్రత్తలో మేముంటు

న్నాము....

"తాము స్పెషల్ స్క్వాడ్ అని చెప్పగానే ఐడెంటిఫికేషన్ చూపించమన్నాను. అందులో ఓ యువకుడు చూపించాడు. ఫోటోతోబాటు అంతా ఖచ్చితంగా వుంది. నమ్మక తప్పలేదు. సెర్చ్ కనుమతిస్తే వాళ్ళు అనుమానమున్నచోట గడ్డపలుగుల్తో ఇల్లంతా తవ్వి పారేస్తారు. అందుకే వాళ్లకు ముందుగానే డబ్బాశ చూపించాను. లొంగిపోయారు.

"నా గదిలోకి తీసుకువెళ్ళి డబ్బివ్వబోయాను—అదే నేను చేసిన పొరబాటు. నేను రహస్యంగా ఎక్కడో దాచిన కేష్ నన్ను భయపెట్టి నాచేతే తీయించారు. నిజానికి సేఫ్‌లో చాలా కొద్ది మొత్తం మాత్రమే వుంది. పది లక్షలు వాళ్ళే డిమాండ్ చేశారు. తప్పనిసరి పరిస్థితిలో ఇచ్చాను" చెప్పాడు నాయుడు.

కిరణ్ తనకు దొరికిన ఐడెంటిఫికేషన్ కార్డు చూపించి, "ఈ ఫోటోలో వున్న యువకుడు ఆ యిద్దరు డెకాయిట్స్‌లో ఒకడు. అవునా?" అన్నాడు.

నాయుడు కళ్ళు పెద్దవి చేసి దానివంక చూసి, "ఎగ్జాట్లీ! ఇదే కార్డు నాకతను చూపించాడు. రెండో అతను కూడా తన ఫోటో వున్న కార్డు చూపించాడు. దీన్నిబట్టే నమ్మేశాను. ఇలాంటి ఐడెంటిఫికేషన్ కార్డ్సు గతంలో ఓసారి రైడ్ జరిగినపుడు చూశాను...." అన్నాడు.

అంతలోనే యేదో గుర్తొచ్చి, "మీకీ కార్డెలా దొరికింది?" అన్నాడు నాయుడు.

"ఇంతకి కొద్దిక్షణాల క్రితం ఇదిక్కడే నాకు కనిపిం

చింది. దీన్నిబట్టే మీరు మొదట చెప్పిందంతా అబద్ధమని గ్రహించాను. ఎనీహౌ దోపిడి చేసిన ఇద్దరు యువకుల్లో ఒకడి ఫోటో అనుకోకుండా మనకు చిక్కింది. తక్కినదంతా మేము చూసుకుంటాము....ఇంకా మీరు చెప్పే ముఖ్యమైన సంగతులేమైనా వున్నాయా? ఐ వాంట్ ట్రూత్. కల్లబొల్లి కల్పనలు కాదు" కిరణ్ గొంతు కంచుగంటలా మోగింది.

నాయుడి ముఖం నల్లగా మాడిపోయిం దా మాటతో. "సారీ!....ఇంకేం లేదు" అన్నాడు.

కిరణ్, శ్రీనివాస్ బయటికొచ్చి జీపెక్కారు.

"ఈ ఫోటోని బట్టి దొంగల్ని పట్టుకోవటం కష్టం కాదనే ధైర్యం కలిగింది నాకు" అన్నాడు శ్రీనివాస్ దార్లో.

"ఈ ఫోటోలో వున్నవాడు పాత కేడీ కాదు, మీ పోలీసు రికార్డులో తేలిగ్గా దొరికెయ్యటానికి. ఈ నేరస్థులు ఇరవై మందిలో యే ఒక్కడూ పాత నేరస్థుడు కాదు—అందరూ క్వైట్ న్యూ కల్ప్రిట్స్!" అన్నాడు కిరణ్.

నిరాశగా చూశాడు శ్రీనివాస్.

"అంతలోనే దిగాలుపడిపోతావేం, మైడియర్ ఇనస్పెక్టర్! ఓ 'క్లూ' దొరికింది. తక్కిన వివరాలు మనం పరిశోధించి తెలుసుకోవాలి" అన్నాడు కిరణ్ మందహాసం చేస్తూ.

జీప్ క్రైమ్ బ్రాంచ్ చేరుకునేటప్పటికి కేజీల లెక్కన చివాట్లు పై ఆఫీసర్ల నుంచి శ్రీనివాస్‌కి యెదురుచూస్తున్నాయి.

5

"సమయానికి మీరు ఖర్చులన్నీ భరించి ఆపరేషన్ జరిపించి ఉండకపోతే నా బిడ్డ నిష్కారణంగా చనిపోయి ఉండేవాడు బాబూ! ఈ లోకంలో నాకు మిగిలి వున్నది వీడొక్కడే. గవర్నమెంటాసుపత్రిలో రోగాన్ని మరింత పెంచి, బతకడు తీసుకుపొమ్మన్నప్పుడు నా ఆవేదన ఇంతా అంతా కాదు.

"సమయానికి మీరు దేవుడిలా వచ్చి ప్రయివేటు ఆస్పత్రిలో ఏభై వేలు పైగా ఖర్చుపెట్టి నా బిడ్డను నాకు దక్కించారు. నా చర్మంతో చెప్పులు కుట్టిచ్చినా మీ ఋణం తీర్చుకోలేను బాబూ!" శాంతమ్మ చేతులెత్తి మొక్కింది సతీష్‌కి.

సతీష్ ఆమె రెండు చేతులు తన చేతుల్లో పైకి లేవకుండా మధ్యలోనే ఆపి, "మనం దండం పెట్టుకోవాల్సింది భగవంతుడికమ్మా! నీ కొడుకు పెద్ద చదువులు చదివాడు. కాని పట్టణంలో ఉద్యోగం దొరక్క రిక్షా లాక్కుంటూ బతకాల్సి వచ్చింది. చివరికా వృత్తిలోనే ప్రమాదానికి గురై ప్రాణాలు పోగొట్టుకోబోయాడు. ఇక నీ కష్టాలు గట్టెక్కాయి. రామచంద్ర త్వరలోనే ప్రభుత్వం స్వయంఉపాధి కింద ఇచ్చే డబ్బుతో తన కాళ్ళమీద తను నిలబడగలడు" అన్నాడు చిరునవ్వుతో.

తెల్లగా పాలిపోయి నీరసంగా వున్న యువకుడు రామచంద్ర లేచికూచుని "మీ మేలు ఈ జన్మకి...." అనబోతుండగా అతన్ని వారించి, "త్వరలోనే కొత్త జీవితాన్ని ప్రారంభిస్తావు. నేను ఆ ఏర్పాట్లు పూర్తి

చేస్తాను" అంటూ హుందాగా నడుచుకుంటూ వె పోయాడు.

* * *

ఈ అనాధాశ్రమానికి మీరిచ్చిన లక్షరూపాయల తక్కువ సాయంకాదు సార్! ఒక పూట కూడా కడు నిండా తిండిలేని ఈ అభాగ్యులు రేపట్నుంచి తిం కరువు లేకుండా సుఖంగా వుంటారు. చక్కగా చదు కొని ఆరోగ్యంగా పెరుగుతారు. మీ వితరణ అవధ లేనిది" అన్నాడు శరణాలయం అధికారి చెమ్మగిల్లి కళ్ళతో.

సతీష్ చిన్నగా నవ్వి, "చూడండి, ఈ లక్ష రూపా యలు నేను మీకు సరాసరి ఇవ్వటంలేదు. శరణాలయ పేరున ఎకౌంటు తెరిచి అందులో వుంచుతున్నాను. దా మీద వచ్చే వడ్డీతో ఈ అనాధలకు కావలసినవన్నీ సమకూర్చండి. అవసరాన్నిబట్టి మరికొంత సొమ్ము జ చేస్తాను. ప్రతినెల నేనొచ్చి అన్నీ సక్రమంగా జరుగ తున్నాయో లేదో వెరిఫై చేస్తాను" అన్నాడు.

శరణాలయాధికారి కృతజ్ఞతగా తలూపి "అదే ప లక్షలు సార్! నాకేలాంటి అభ్యంతరం లేదు. నెల నెల శరణాలయానికి విరాళాలు యిచ్చే దాతలు కూడా వున్నారు. అవీ, ఇదీ కలిసి వీళ్ళ అవసరాలకి దివ్యంగా సరిపోతాయి. ఇక మాకు నిశ్చింత. ఇక చెకింగ్ విషయం మీకు సర్వాధికారాలుంటాయి. నెలకొకసారేకాదు ఎన్నిసార్లయినా, నెలలో యెప్పుడైనా వచ్చి చెక్ చేసుకోండి. చేసుకోవాలి కూడా!" అన్నాడు.

* * *

"నా కూతురి జీవితం నిలబెట్టావు బాబూ! నువే

ఆదుకోకపోతే కట్నానికి, పెళ్ళి ఖర్చులకి లేక నా కూతురు పెళ్ళి ఆగిపోయి వుండేది. సమయానికి అప్పు పుట్టలేదు. ముహూర్తం వాయిదా వేసుకునే సావకాశమూ లేదు! దేవుడిలా సమయానికి పాతిక వేలు సర్ది నా పరువు మర్యాదలు, నా బిడ్డ బతుకు నిలబెట్టావు. నా కంఠంలో ప్రాణముండగా నీ ఋణం తీర్చుకుంటాను బాబూ!"

రాఘవయ్య కళ్ళలో నీటిపొర కదిలి చెక్కిళ్ళమీద ఉరికింది.

"బాబాయిగారూ. నేనీ డబ్బు ఋణంగా ఇవ్వటం లేదు. ఓ అన్నగా ఆడపడుచుకి పసుపు కుంకుమలకింద యిస్తున్నాను. మీరు ఋణం, పణం అంటూ పెద్ద మాటలు వాడితే వెంటనే వెళ్ళిపోతాను" సతీష్ బెదిరించాడు.

"వద్దన్నయ్యా, నువ్వు వెళ్ళొద్దు. నా పెళ్ళి నువ్వు లేకుండా జరగదు. అక్షతలు వేసి ఈ నిర్భాగ్యురాలైన చెల్లెల్ని ఆశీర్వదించి వెళ్ళు!" సతీష్ కాళ్ళు తాకబోయింది నీరజ.

చటుక్కున ఆమెను వారించి, తలమీద ఆప్యాయంగా నిమిరి, "నీ పెళ్ళి చివరికంటా చూసి మరీ వెళ్తానమ్మా! నీ వైవాహిక జీవితం నిండు నూరేళ్ళు సుఖసంతోషాలతో వర్ధిల్లాలని నిండు మనసుతో భగవంతుని కోరుకుంటూ నిన్నాశీర్వదిస్తున్నాను" అన్నాడు సతీష్.

• • •

"ఇంటిల్లిపాదికీ వాడి ఉద్యోగమొక్కటే ఆధారం. వాడు బ్యాంక్‌లో డిపాజిట్ చేయబోయిన లక్షన్నర రూపాయల్ని దొంగలు దోచుకుపోతే సమయానికి ఆ

డబ్బు కట్టి వాడ్ని పోలీసుల బారినుంచి కాపాడావు. వాడి ఉద్యోగంపోకుండా కాపాడి, మా ఇంటిల్లిపాదినీ పస్తులతో చావకుండా బతికించావు. ఏ తల్లి కన్నబిడ్డవో నా ఆయుష్షు కూడా పోసుకుని వెయ్యేళ్ళు వర్ధిల్లు నాయనా."

"ఆమె ఆశీస్సులతో పునీతుడై పోతూ చిరునవ్వు చిందిస్తూ నిల్చున్నాడు సతీష్.

రఘు సతీష్ చేతులు పట్టుకుని కళ్ళకు హత్తుకుని, "మా నాన్నగారు పోయాక యెంతో కష్టపడి సంపాదించుకున్నా నీ ఉద్యోగం. నా దురదృష్టవశాత్తూ ఆఫీసు డబ్బు బ్యాంక్‌లో కట్టేలోపల మాయమైపోయింది. లక్షన్నర రూపాయలు తక్కువ మొత్తంకాదు. ఎలా తీర్చుకోగలనో అర్థంకావటంలేదు. నెల నెలా కొంత డబ్బు నా జీతంనించి తీసి నీకు కట్టేద్దామంటే నా జీతం తప్ప మా కుటుంబ సభ్యులు ఎనిమిదిమందికీ మరో దారి లేదు. నాకో దారి చూపించు అన్నా!" అన్నాడు కన్నీరు కారుస్తూ.

"నీకు చూపించాల్సిన దారేదో నిన్ననే చూపించాను. దాన్ని నాకు తిరిగి చెల్లించాలని వృధా ప్రయాసపడకు. ఎప్పుడో నేనే ఏదో రూపంలో వసూలు చేసుకుంటాను" సతీష్ పెదాలమీద అదే చెరగని చిరునవ్వు.

• • •

"పూర్ బాయ్స్ ఫండ్‌కి లక్షరూపాయలతో ట్రస్టు ఏర్పరుస్తూ నీ పేరు బయటపెట్టవద్దంటే ఎలా బాబూ! ప్రభుత్వానికి, స్కూలు మేనేజిమెంటుకి మేము లెక్కలు చూపించాలికదా! పోనీ నీ పేరు కాకపోయినా, మరో పేరైనా సూచించు. లేదా ఏ సంస్థ పేరైనా

సూచించు.”

హేడ్మాష్టరు చెప్పిందంతా విని మందహాసం చేశాడు సతీష్.

“మాష్టారూ! మీరు నాకు చదువు చెప్పిన గురువు. ఆ ట్రస్టు మీ పేరునే వుంచండి” అన్నాడు.

“నా పేరుమీదనా? వద్దు బాబూ, పాఠాలు చెప్పుకునే బడిపంతులికి అంత డబ్బు ఒక్కసారిగా యెలా వచ్చిందని ఆరావస్తుంది. అది నా వల్ల కాదు బాబూ!”

“మాష్టారూ! ‘విద్య నిగూఢవిత్తం’ అన్నారు. ఈ డబ్బుతో చదువుకునే స్తోమతలేక చదువు మధ్యంతరంగా ఆపివేసే యెందరో బీద విద్యార్థులు, ప్రతిభావంతులైన పేదవాళ్ళు చదువుకొని పైకొస్తారు ఇలాంటి మహత్కార్యానికి ఈ డబ్బు ఉపయోగపడేటప్పుడు ఇది యెవరిచ్చారన్న విచారించుకు మాష్టారూ!....సరే, మీరంతగా బలవంతం చేస్తున్నారు కాబట్టి దీన్ని ఏ.పి. బాంధవ్ అన్న పేరుమీద నడిపించండి” అన్నాడు సతీష్.

హెడ్మాష్టరు తెల్లబోయి, “ఏ.పి. బాంధవ్ నా? అలాంటి పేర్లు కూడా ఉంటాయా?” అన్నాడు.

“ఎందుకుండవు మాష్టారూ! ఏ.పి. బాంధవ్ అంటే ఆపద్బాంధవుడని అర్థం” అన్నాడు సతీష్.

• • •

“హల్లో, ఎవరు మాట్లాడేది?” సతీష్ అడిగాడు ఫోన్‌లో.

“ఏ.పి. బాంధవ్ కావాలి” అన్నారవతలినుంచి ఎవరో.

“ఎస్—స్పీకింగ్!” అన్నాడు సతీష్.

"కలప రెండు లక్షలు."

"ఊఁ!"

"ఏస్ బెస్టాస్ షీట్సు పదిహేడు లక్షలు."

"ఓ.కే!"

"సిమెంటు, బ్రిక్స్ అదర్ ఎక్స్పెన్సెస్ కోసం పదిహేడు లక్షలు."

"ఊఁ!"

"మందులు, ఏంటీ కలరా ఇనాక్యులేషన్స్ వగ(మెడికల్ అండ్ హెల్తు సర్వీసెస్ కోసం లక్షలు."

"అలాగే! మరో విషయం మరిచిపోయావు. డ్రింకింగ్ వాటర్ ప్రొవైడ్ చెయ్యాల్సిన అ(యేంతయినా వుంది. వాటర్ బోర్న్ డిసీజెస్ (రావటానికెంతో స్కోప్ వుంది."

"అవును. టాంకర్ల ద్వారా నీరు సరఫరా చెయ్య(ఇదివరకే ఏర్పాట్లు చేశాం కదా! అందుకోసం పాతిక వేలు ఖర్చవుతుంది."

"సరే! మొత్తం ఎమౌంట్ కి డి.డి. పంపిస్తాను. యేర్పాట్లు సక్రమంగా ఉండేలా మీరందరు ప్ర శ్రద్ధ తీసుకోవాలి."

"ష్యూర్, ష్యూర్!"

"థాంక్యూ!" రిసీవర్ క్రెడిల్ చేశాడు సతీష్.

"ఇప్పటివరకు పది దోపిడీలు జరిగాయి. ఒక్క కూడా పరిష్కరించలేకపోయినందుకు మా ఉద్యో లూడిపోయేలా వున్నాయి" శ్రీనివాస్ వాపో(

కిరణ్ జాలిగా చూశాడతని వంక.

"ఒక్క కేసు కూడా....అంటున్నావు—ఒక కేసు పెటిలయితే తక్కిన తొమ్మిది పరిష్కారమయిపోయినట్టే కాదా?"

"ఆ ఫోటో నిజం ఫోటో నేనంటావా?"

"ఫోటో నిజం ఫోటోయే! కాని ఐడెంటిఫికేషన్ కార్డు, డిపార్టుమెంటు సీల్సు, సంతకాలు అన్నీ డూప్లికేట్. రాజానాయుడ్ని బుట్టలో వేయటానికి ఆ దొంగలు పన్నిన మాస్టర్ ప్లాన్!"

"మనకు కావలసింది ఫోటోలోని వ్యక్తి. అతనే రాజానాయుడ్ని దోచిన ఇద్దర్లో ఒకడు కాబట్టి అతన్ని ట్రేస్ చెయ్యగలిగితే మబ్బు విడిపోయినట్టే!"

"ఆ వ్యక్తి అంత నిర్లక్ష్యంగా, తన ఐడెంటిటీ గురించి ఏమాత్రం శ్రద్ధతీసుకోకుండా ప్రవర్తించాడంటే అతని కెంత ఆత్మవిశ్వాసముందో అర్థమవుతుంది. అంత తేలిగ్గా మనకి చిక్కడని నా నమ్మకం. ఎనీహౌ, మన ప్రయత్నాలు చేద్దాం. ఆ మాస్టర్ బ్రెయిన్స్‌ని మించిన వ్యూహం పన్నాలి మనం."

"చెప్పు బ్రదర్, నిప్పుల్లో దూకమన్నా, సముద్రంలో మునగమన్నా, పులిబోనులో తల పెట్టమన్నా—సిద్ధంగా వున్నాను."

"అంత కష్టపడనక్కర్లేదు. ఈ ముఠాచోరులు బాగా డబ్బున్న ఇళ్ళమీదే దాడిచేస్తున్నారు. అదీగాక ఆ ధనవంతులు అన్యాయంగా, దారుణంగా ఆర్జించిన వాళ్ళయి ఉంటున్నారు. దీన్నిబట్టి మనకర్థమైందేమిటంటే, ప్రజల్ని ఘోరంగా దోచుకుని కోట్లు గడించిన వాళ్ళ ఇళ్ళే దోపిడీ చేశారు, చేస్తున్నారు, చేస్తారు. కాబట్టి నగరంలో అలాంటి బడా బాబు లెవరున్నారో

లెక్కతీసి వాళ్ళిళ్ళ దగ్గర మనం మాటువేసి వుంచాలి. అప్పుడు పిట్టలు సరాసరి వచ్చి వలలో చిక్కుతాయి" అన్నాడు కిరణ్.

"సాధారణంగా కోట్లు గడించిన వాళ్ళందరు దాదాపుగా ప్రజల్ని వంచించో, దోచుకునో, అక్రమంగా ఆర్జించినవాళ్ళే! అలాంటి వాళ్ళు నగరంలో వందల సంఖ్యంలో ఉంటారు. వాళ్ళందరినీ కవర్ చెయ్యాలంటే...."

"కష్టమంటావు. మీ డిపార్టుమెంటు చిన్నదేం కాదు. ఒక్కో యింటి దగ్గరా యిద్దరి చొప్పున నిఘా వేయించు. వాళ్ళందరికీ మినీ వైర్లెస్ సెట్స్ ప్రొవైడ్ చెయ్యి. వాటితో కంట్రోల్ రూంకి రిలేషన్స్ ఏర్పాటు చెయ్యి. అయితే మనమీ ఏర్పాట్లు చేస్తున్నట్టు ఆ యువచోరుల కేమాత్రం తెలియకూడదు. అలా జరిగితే ముందే జాగ్రత్తపడిపోతారు. ఎన్నటికీ మనకు చిక్కరు" హెచ్చరించాడు కిరణ్.

శ్రీనివాస్ తలూపి, "ఇప్పట్నుంచీ ఆ అరేంజిమెంట్స్‌లో వుంటాను.... సరే, ఇంకేం చెయ్యమంటావో చెప్పు" అన్నాడు.

"ఓసారి తక్కిన తొమ్మిదిమంది కోటీశ్వరుల్ని కలిసి, వాళ్ళ కథనాల్ని కూడా విందాం. వాళ్ళు యువచోరుల రూపురేఖా విలాసాల్ని వర్ణించి చెపితే వాటిని మనం బాగా గుర్తుపెట్టుకుని మన వేట సాగిద్దాం."

"మనుషుల్ని చూసింది వాళ్ళు, మనమెలా గుర్తుపట్టగలం?"

"మెదడుతో. వాళ్ళు ఇరవైమందీ ఇప్పటిదాకా మారువేషం వెయ్యలేదు. తమ ఒరిజినల్ రూపాల్లోనే

ధైర్యంగా నేరాలు చేశారు. వాళ్ళని మరోసారి చూస్తే ఈ మోసపోయిన కోటీశ్వర్రావులందరు గుర్తుపట్టగల రంటావా, లేదా?"

"ఈ చోర శిఖామణులు లీలోపల దేశం వదిలి పారి పోతేనో....!?"

"ఓ.హో, ఇన్‌స్పెక్టర్. నీకు అన్నీ రాకూడని అను మానాలే వస్తాయేం? వాళ్ళు ఇప్పట్లో యెక్కడికీ పారి పోరు—బహుశా యెప్పటికీ పారిపోరనే నా నమ్మకం. మీవాళ్ళని ఈ క్షణంనించీ ఎలర్ట్ చెయ్యి. ప్రతి జంటకీ వైర్‌లెస్ సెట్స్ యివ్వటం మాత్రం మరిచిపోకు."

"అది మరిచిపోతానా? ఇప్పుడే హెడ్‌క్వార్టర్స్‌కి ఫోన్ చేసి అత్యవసర సమావేశం ఏర్పాటు చేస్తాను. మరి ఆ తొమ్మిదిమంది విక్టిమ్స్‌ని ఎప్పుడు కలుద్దాం?"

"ఇప్పుడే. ఆ సమావేశం కేవలం ఓ గంటలో ముగించుకుని రా! నేనిక్కడే యెదురుచూస్తూంటాను" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ హడావిడిగా వెళ్ళిపోయాడు.

సరిగ్గా అప్పుడే టేబిల్ మీద ఫోన్ గణగణ మోగింది. కిరణ్ రిసీవరందుకున్నాడు.

"హల్లో....క్రైం బ్రాంచ్....!" అన్నాడు.

"హల్లో, ఎవరు మాట్లాడేది?"

"ముందు మీరెవరో చెప్పండి" కిరణ్ గొంతు కంచులా మోగింది.

"ప్లీజ్, కోపగించకండి. నాకు డిటెక్టివ్ కిరణ్ గారు కావాలి. అక్కడుంటే కాస్త పిలవండి" అవతలి గొంతు అభ్యర్థించింది.

"ఎస్. కిరణ్ స్పీకింగ్. మీరెవరు?"

"సమస్తే కిరణ్ గారూ! మీ గొంతు గుర్తించలేక పోయాను. క్షమించాలి."

"ఆల్ రైట్, మీరెవరు, నాతో మీకేం పని?"

"అది చెప్పాలనే రింగ్ చేశాను సార్! నేను ఇప్పటి వరకు జరిగిన దోపిడీలకి మూలకారకుడ్ని...."

కిరణ్ త్రుళ్ళిపడ్డాడు. అతని చేతిలోని రిసీవర్ బిగుసుకుంది. కణతలు పొంగాయి.

"నీ పేరు?"

"పేరులో యేముంది సార్, మా కార్యక్రమం పూర్తయ్యాక మేమే స్వయంగా పోలీసులకు లొంగి పోతాం. దయచేసి మా టార్గెట్ పూర్తయ్యేవరకు మా కార్యకలాపాలకు అడ్డురాకండి."

"బెదిరిస్తున్నావా?"

"నో నో! అంత మాటనకండి సార్! మీ సామర్థ్యం, మేధాశక్తి, మీరు సాధించిన ఘనవిజయాలు—అన్నీ మాకు తెలుసు సార్! ఎన్నో క్లిష్టమైన కేసుల్ని సునాయాసంగా పరిష్కరించి, జాతీయ, అంతర్జాతీయ నేరస్తుల్ని మీరు చట్టానికి పట్టి అప్పగించటం కూడా మాకు తెలుసు.

"ఈ కేసులో మీరు పని చేస్తున్నారని ఇంతకు కొద్ది నిమిషాల క్రితమే మాకు తెలిసింది. మీరు కలగజేసుకుంటే మా ఆట కట్టయిపోతుందని, మా లక్ష్యం నెరవేరకుండా పోతుందని భయపడుతున్నాము. మీకు చేతులెత్తి నమస్కరిస్తున్నాను. దయచేసి ఈ కేసునుంచి విరమించండి."

"మిస్టర్, చాలా తెలివిగా మాట్లాడుతున్నావో, అమాయకుడివో అర్థం కావటంలేదు. లక్షలకు లక్షలు

దోపిడీ చేస్తూ నగరంలోని ధనికవర్గాన్ని, పోలీసుల్ని అదరగొడుతూ విశృంఖలంగా స్వైరవిహారం చేస్తూన్న మిమ్మల్ని నేను క్షమించలేను. మిమ్మల్ని పట్టి బంధించే వరకూ విశ్రమించను. నాకు ఫోన్ చేసి చాలా శ్రమ తీసుకున్నావు. ఇప్పటికైనా మించిపోయిందిలేదు. స్వచ్ఛందంగా లొంగిపోదలచుకుంటే యూ ఆర్ మోస్టు వెల్కమ్! లేదా, మా పరిశోధనలో పట్టుబడక తప్పదు. ఇబ్బడిముబ్బడిగా శిక్ష అనుభవించక తప్పదు! బి కేర్ ఫుల్!"

"కిరణ్ గారూ! మే మనుకున్న లక్ష్యం సగం మాత్రమే నెరవేరింది. తక్కిన సగం పూర్తయిన వెంటనే మేం స్వయంగా పోలీసులకు లొంగిపోతామని మరోసారి మనవి చేస్తున్నాను. మేం బీదవాళ్లని, అమాయకుల్ని, న్యాయంగా సంపాదించిన ధనవంతుల్ని దోచుకోవటం లేదు. ప్రజల్ని, ప్రభుత్వాన్ని మోసం చేసి అన్యాయంగా అక్రమంగా సంపాదించిన కొద్దిమంది కోటీశ్వరుల్నుంచి స్వల్పంగా పెనాల్టీ వసూలు చేస్తున్నాము, అంతే! మీ రీ పాటికే మా పద్ధతిని గ్రహించే వుంటారు. దయచేసి ఒక వారంరోజులపాటు మీరు జోక్యం చేసుకోకుండా వుంటే. ఈ లోపల మే మనుకున్నది సాధిస్తాం. తృప్తిగా సరెండరయిపోతాం."

"మిస్టర్, నీ ఉపన్యాసం ఆపు ...ఇంతసేపూ యేదో లక్ష్యమూ, టార్గెట్ అంటూ చెప్తూన్నావే. అదేమిటో నాకు చెప్పు. అది సమంజసమైనదీ, ప్రజోపయోగకరమైనదీ అని నా కనిపిస్తే నేను నీ కేదైనా సలహా యివ్వగలను. అంతేగాని మరొక్క దోపిడీకి కూడా అనుమతించలేను, క్షమించను" కిరణ్ గొంతు స్థిరంగా నిశ్చలంగా

పలికింది.

అవతలి వ్యక్తి కొద్ది క్షణాలసేపు మాట్లాడలేదు. తర్వాత గొంతు సవరించుకుని "క్షమించండి కిరణ్ గారూ! నా లక్ష్యం అసంపూర్తిగా మిగిలిపోయింది. దాన్నిప్పుడు వెల్లడి చెయ్యలేను. త్వరలోనే నేను స్వయంగా మిమ్మల్ని కల్సుకుని అంతా వివరిస్తాను. నా కోరిక మన్నించి ఒక వారంరోజులు మీరు అంతరాయం కలిగించరని విశ్వసిస్తున్నాను. మరోసారి చేతులు జోడించి నమస్కరిస్తున్నాను" అన్నాడు.

"సారీ, మిస్టర్!—సంఘవిద్రోహక శక్తుల గుండెల్లో నిద్రపోతా డీ కిరణ్. నువ్వూ, నీ సహచరులు చేస్తున్న ఈ దోపిడీలని నేను క్షమించలేను. మిమ్మల్ని శిక్షించక తప్పదు. మరోసారి, ఆఖరిసారి హెచ్చరిస్తున్నాను— మీ అంతట సరెండరయిపోయినా సరే, లేదా—త్వరలో అతి త్వరలో మీ అందర్నీ పట్టి చట్టాని కప్పగిస్తాను."

"సారీ, కిరణ్ సాబ్! ఆరంభించిన పనిని మధ్యలో వదలిపెట్టలేను. విష్ యూ బెస్టాఫ్ లక్!"

"విష్ యూ బాడ్ లక్!" అంటూ ఫోన్ క్రెడిల్ చేశాడు కిరణ్.

మరో అరగంట తర్వాత తిరిగొచ్చిన శ్రీనివాస్ వంక ప్రశ్నార్థకంగా చూశాడు కిరణ్.

"అన్ని యేర్పాట్లు పూర్తయ్యాయి. అన్యాయంగా అక్రమంగా ధనార్జన చేసిన కోటీశ్వరు లీ నగరంలో లెక్కకుమించి వున్నారు. అందరిళ్ల దగ్గర మఫ్టీలో మా వాళ్లని ఎరేంజ్ చేశాం. దొంగలకి అనుమానంగాకుండా రహస్యంగా, అతి సహజంగా మావాళ్ళు గస్తీ తిరిగే ఏర్పాట్లు చేశాం. ఇక ఆ డెకాయిట్స్ తప్పించుకు

పోలేరు" శ్రీనివాస్ గొంతులో ఆవేశం, కసి ధ్వనించాయి.

"నీ శత్రువుల్లో ఒకడ్ని ఇంతక్రితమే కల్సుకున్నాను" చెప్పాడు కిరణ్.

అదిరిపడి చూశాడు శ్రీనివాస్ అతనివంక. "ఏడీ? ఎవడు వాడు?" అన్నాడు ఆత్రుతగా.

"ముఖస్తంగా కాదు—ఫోన్లో."

"ఏమంటున్నాడు? అసలు ఎవడు వాడు?"

"ఎవడో తెలీదు—కాని త్వరలోనే మనం బంధించగలం."

"వివరంగా చెప్పు బ్రదర్, సస్పెన్స్‌లో పెట్టక!"

"చెప్తాను. పద!" అన్నాడు కిరణ్ లేస్తూ.

శ్రీనివాస్ అయోమయంగా చూశాడు.

7

"హల్లో, ఏ. పి. బాంధవ్ స్పీకింగ్!" అన్నాడు సతీష్.

"నేనూ, భారత్‌ని మాట్లాడుతున్నాను. అర్జంటుగా పన్నెండు లక్షలు కావాలి. మెసంజర్ చేత పంపించు! డి.డి., ఎమ్.వోలు ఆలస్యమవుతాయి" అవతలి వ్యక్తి కంగారుగా చెప్పాడు.

"అలాగే పంపిస్తాను. కాని ఈ రోజు వీలుకాక పోవచ్చు."

"అలా అంటే ఎలా బాంధవ్! ఇంతవరకు వచ్చాక మనం వెనకాడితే ఎలా? ఇదే చాలా క్రిటికల్ పొజిషన్."

"అవును భారత్, కాని నా దగ్గర యిప్పుడు అంత క్యాష్ లేదు. ప్రస్తుతం నాలుగు లక్షలుంది. పంపిస్తా

న్నాను— రేపు ఉదయానికి తక్కినది పంపిస్తాను."

"సరే, అదేదో తొందరగా కానివ్వు. చాలా అర్జంటు."

"ఇప్పుడే పంపిస్తున్నాను. అక్కడ పరిస్థితు లెలా వున్నాయి? అదుపులో వున్నట్టేనా?"

"చాలా ఆశాజనకంగా వుంది. ఇప్పుడు మనం అధికంగా యెంతయినా ఆదుకోవాలి. అందుకే అర్జంటు అంటున్నాను."

"ఓ.కే! మరో అరగంటలో మన క్యాష్ బయలుదేరు న్నాడు. పెట్టేస్తున్నాను" అంటూ రిసీవర్ క్రెడిల్ చేశాడు సతీష్.

సరిగ్గా అప్పుడే ఓ యాభైయేళ్ళ వ్యక్తి లోని కొచ్చాడు. ప్రశ్నార్థకంగా చూశాడు సతీష్.

"బాబూ, ఓ పదివేలు సర్దగలవా? అల్లుడు అమ్మాయిని వేధిస్తున్నాడు. పెళ్ళికి ఆదుకున్నావు. మళ్ళీ అడగటానికి నోరు రావటంలేదు" అన్నా డాయన.

"చూడండి బాబాయిగారూ, పెళ్ళి ఆగిపోతుందన్న సమయంలో కట్నానికి, లాంఛనాలకి చాలా డబ్బిచ్చాం అల్లుడికి. మన మిస్తున్నాం కదా అని అతను పదే పదే డిమాండ్ చేయటం విచారకరం. పెళ్ళయి నాలుగునెలలు కాలేదు, అప్పుడే అమ్మాయిని వేధిస్తున్నాడంటే, ఇక జీవితాంతం డబ్బుకోసం రాచి రంపాన పెడతాడన్న మాట! ఇలాంటి వాడికెలా సమాధానం చెప్పాలో మేం చూసుకుంటాం. మీరు వెళ్ళండి."

"బాబూ! అలా అంటే ఎలా? ఎంతయినా అల్లుడు. మీరు కలగజేసుకుంటే దాని కాపుర మేమైపోతుందో?

ఒక పదివేలు సర్దితే అమ్మాయి సంసారం చక్కబడుతుంది. మీ కది ఓ లెక్కలోది కాదు. నేను ఎలాగో వీలునుబట్టి తీర్చేసుకుంటాను."

"బాబాయిగారూ, నేను డబ్బుకు వెనుతీసే మనిషిని కాదని మీకు తెలుసు. నన్నర్థం చేసుకోరేం? ఇలా అలవాటుచేస్తే మీరు చక్కబడుతుందనుకొంటున్న చెల్లాయి కాపురం అస్తవ్యస్తమైపోతుంది. చీటికి మాటికి డబ్బు కోసం పుట్టింటికి పంపేస్తాడు అల్లుడు. మీరలా చూస్తూండండి, డబ్బుతో నిమిత్తం లేకుండా అంతా మేము సరిచేస్తాము."

"బాబూ, అల్లుడిని కొట్టడం, అలాంటిదేమీ చెయ్యరు కదా....!?"

"మీరు వెళ్ళండి బాబాయి, యేం చెయ్యాలో మాకు తెలుసు."

"బాబూ! మీకు డబ్బివ్వకపోతే పోనీగాని దాని సంసారం రచ్చకెక్కించకండి. నేనే ఎక్కడో తంటాలు పడి సర్దుబాటు చేసుకుంటాను. మీ కిదివరకిచ్చిన సొమ్మును యెలాగో వీలువెంట తీర్చుకొంటాను...."

"బాబాయ్" సతీష్ గొంతులో ఆవేదన, బాధ తొంగిచూశాయి. "మీరు నన్ను చాలా అపార్థం చేసుకున్నారు. మీ వ్యక్తిగత విషయాల్లో తలదూర్చే అధికారం మాకులేదు. అవసరానికి సహాయపడటం మా ధర్మంగా భావించాము, చేశాము. ఆల్ రైట్, ఇక మీ అమ్మాయి విషయంలో మేమెలాంటి జోక్యం చేసుకోము—మీరు నిశ్చింతగా ఉండొచ్చు." సతీష్ కణతలు రుద్దుకుంటూ కుర్చీలో శిలావిగ్రహంలా కూచుండిపోయాడు.

చివరికి తను చేసిందానికిదా ప్రత్యుపకారం? నిందలు, నిష్ఠూరాలేనా కడకు మిగిలేది? ఆపదలో సహాయపడినందుకు సంతోషించేది పోయి, ఇంకా యింకా సాయం చెయ్యాలని కోరటం, చెయ్యకపోతే యింతక్రితం చేసిందాన్ని కూడా తృణప్రాయంగా చూడటం—ఇదా తను కోరుకున్నది!? మనుషులింత స్వార్థపరులా? చేసిన మేలు నింత త్వరగా మరచిపోయే కృతఘ్నులా?

సతీష్ మనసు వికలమైపోయింది.

"నీకు చేతనయిన సాయం చెయ్యి. ఆపదలో అడ్డుపడు. అంతేగాని కృతజ్ఞతలు, ప్రత్యుపకారాలు, గుర్తింపు కోరకు" అతని అంతరాత్మ హెచ్చరించింది.

సతీష్ మనసు క్షణాల్లో ప్రశాంతతను సంతరించుకుంది.

"అవును, నాకు చేతనైన సాయం, కష్టంలో ఉన్న వాళ్ళకి చేస్తున్నాను. వాళ్ళ జీవితాలను చక్కదిద్దగలుగుతున్నాను. ఆ తృప్తి, మనశ్శాంతి చాలు తనకి! అంతకన్న తను కోరేదిలేదు!"

సతీష్ పెదాలమీద చిరునవ్వు మెరిసింది.

అప్పుడే శ్యామ్ లోపలికి అడుగు పెట్టాడు. సతీష్ ఐరన్ సేఫ్ వైపు నడిచాడు.

8

సికింద్రాబాద్ స్టేషన్ పక్కగా పోలీస్ జీప్ పోతోంది. కిరణ్, శ్రీనివాస్‌లు సరోజినీదేవి రోడ్‌లో వున్న మనీలాల్ యింటికి వెళ్తున్నారు.

అకస్మాత్తుగా కిరణ్ దృష్టి అప్పుడే టాక్సీ దిగి స్టేషన్‌లోకి వెళ్తున్న వ్యక్తిమీద పడింది. అతని చేతిలో చిన్న బ్రీఫ్ కేస్ మాత్రం వుంది.

"ఇన్‌స్పెక్టర్ జీప్‌ని సరాసరి స్టేషన్ ముందుకు పోనివ్వు. క్విక్!" అన్నాడు కిరణ్.

మరుక్షణం జీప్ స్టేషన్ ముందాగింది.

ఒక్క గెంతులో లాంజ్‌లోకి ఉరికాడు కిరణ్. సరిగ్గా అప్పుడే ఆ వ్యక్తి టికెట్ తీసుకోవటం, ట్రెయిన్ వైపు పరుగెత్తడం జరిగింది.

మద్రాసుపోయే ఎక్స్‌ప్రెస్ ట్రెయిన్ అప్పుడే పెద్దగా అరిచి ముందుకి కదిలింది. అతను ఓ కంపార్ట్‌మెంట్‌లోకి ఎక్కాడు. ఆ వెనకనే మెరుపువేగంతో కిరణ్ దూసుకుపోయి ఆఖరిక్షణంలో అదే కంపార్టుమెంట్‌లోకి ఎక్కాడు.

డోరుకు అడ్డంగా మహా ప్రవాహంలా జనం.... జనం....వాళ్ళు ఓ పట్టాన కిరణ్‌ని లోనికి చొరబడనివ్వలేదు.

కిరణ్ తన సూదంటురాయిలాంటి దృష్టిని లోపలికి ప్రసరించి ఆ వ్యక్తిని దృష్టిపథంనుంచి తప్పించుకోకుండా చూసుకుంటున్నాడు. మెల్లిగా జరుగుతూ అతన్ని సమీపించాడు.

అయితే, అప్పటికే ఆ వ్యక్తి కిరణ్‌ని చూసేశాడు. ఒక్కక్షణం అతని భ్రుకుటి ముడిపడింది. ఆ మరుక్షణం ఒక్కసారిగా కంపార్టుమెంటు ఆ చివరకు దూసుకుపోయాడు.

కిరణ్ ప్రమాదాన్ని గుర్తించాడు. జనాన్ని తప్పించుకుంటూ వేగంగా అతన్ని చేరుకున్నాడు—అప్పటికి ట్రెయిన్ వేగం పుంజుకుంటోంది. ప్లాట్‌ఫాం దాటేసింది.

"మిస్టర్, ఆగు!" అన్నాడు కిరణ్.

అయితే ఆ వ్యక్తి ఆగలేదు. ట్రెయిన్‌లోనుంచి కిందికి గెంతేశాడు.

అయితే అతను సరాసరి ట్రెయిన్ చక్రాల క్రిందకి వెళ్ళిపోయాడు. మరుక్షణం హృదయవిదారకమైన కేక వెలువడటం, కిరణ్ చెయ్యి అలారం గొలుసును బలంగా కిందికి లాగటం ఒకేసారి జరిగిపోయింది.

కీచుమంటూ చప్పుడు చేశాయి ట్రెయిన్ చక్రాలు. చిన్న జర్క్‌తో ట్రెయిన్ ఆగిపోయింది.

సరిగ్గా అప్పటికి శ్రీనివాస్ కూడా వేగంగా అక్కడికి దూసుకొచ్చాడు.

హృదయవిదారకమైన దృశ్యం చూపరులను కాసేపు దిగ్భ్రాంతిలో ముంచేసింది.

శవం తల మొండెంనించి వేరైపోయింది. బ్రీఫ్‌కేస్ మాత్రం దూరంగా పడిపోయివుంది. శ్రీనివాస్ దాన్ని బలవంతాన తెరిచాడు. దాన్నిండా కరెన్సీ నోట్లు! లెక్కించాడు శ్రీనివాస్. సరిగ్గా నాలుగు లక్షలు!

కిరణ్ గుండెనెవరో ఇనప పిడికిలితో నలిపినట్టు ఫీలయ్యాడు. దొరికిన ఒకే ఒక సాక్షి మృత్యుకోరల్లో నలిగిపోయాడు. డెకాయిట్స్ జాడ కనుక్కునే అవకాశం దొరికినట్టే దొరికి చేజారిపోయింది.

శ్రీనివాస్ ప్రశ్నార్థకంగా చూశాడు కిరణ్ వంక. కిరణ్ కోటుజేబులోనించి రాజానాయుడి ఇంటిదగ్గర దొరికిన ఐడెంటిటీ కార్డు చూపించాడు. అందులోని ఫోటోలోని యువకుడు వంక, శవం ముఖం వంక మార్చి మార్చి చూశాడు శ్రీనివాస్.

"మైగాడ్! డెకాయిట్" అప్రయత్నంగా అతని నోటినుంచి వెలువడ్డాయా రెండు మాటలు.

"ఈ ఫార్మాలిటీస్ అన్నీ యెవరికైనా అప్పగించు. మనం వెంటనే వెళ్ళాలి" అన్నాడు కిరణ్.

శ్రీనివాస్ స్టేషన్ మాస్టర్ రూంవైపు వేగంగా నడిచాడు.

మరో పదినిమిషాల తర్వాత ఇద్దరు స్టేషన్ బయటున్న జీప్ చేరుకున్నారు.

కిరణ్ స్టీరింగ్ ముందు కూచున్నాడు. జీప్ రోడ్ యెక్కుతుండగా వైర్ లెస్ సెట్ నించి బీప్....బీప్.... మంటూ సిగ్నల్స్ రావటం మొదలయ్యింది.

శ్రీనివాస్ అటెండయ్యాడు. వింటున్న అతని కళ్ళు మెరిశాయి. కిరణ్ జీప్ ని పక్కగా తీసి నిలిపాడు.

"శేఠ్ చందన్ లాల్ ఇంట్లో ఇంతకు కొద్దినిమిషాల కితం ఇద్దరు యువకులు ఓ సూట్ కేస్ తో ప్రవేశించారట. అక్కడ సెంట్రీలుగా వున్న మన ఏజెంట్స్ మెసేజ్ పంపారు" అన్నాడు శ్రీనివాస్ కిరణ్ వైపు టెన్షన్ తో చూస్తూ

కిరణ్ వెంటనే మెసేజ్ కి తను అటెండయ్యాడు.

"మీరు వాళ్ళని నిరాటంకంగా తమ పని పూర్తి చేసుకోనివ్వండి. వాళ్ళు బయటకొచ్చేవరకు మీరక్కడే ఉండండి. మేము పదినిమిషాల్లో చేరుకుంటున్నాం అక్కడికి. ఈలోపల వాళ్ళు బయటికొచ్చి వెళ్ళిపోతుంటే వాళ్ళని వెంటనే వెంబడించండి. ఏ రూట్ లో వాళ్ళు వెళ్తున్నదీ మాకు కంటిన్యూస్ గా మెసేజ్ పంపుతూ వుండండి. దాన్నిబట్టి మేం ఫాలో అవుతాం. ఎట్టి పరిస్థితుల్లోను వారినాపవద్దు....ఓవర్...." అన్నాడు కిరణ్.

తర్వాత శ్రీనివాస్ కి సెట్ నందించి, "హెడ్ క్వార్ట

ర్సుకి మెసేజ్ పంపు. ప్రస్తుతానికి చందన్‌లాల్ యింటి సమీపంలో వెయిట్ చెయ్యమని చెప్పు. తర్వాత ఎక్కడికి ఫాలో కావలసింది చెప్తానని చెప్పు" అన్నాడు.

శ్రీనివాస్ మెసేజ్ పంపుతుండగానే మెరుపు వేగంతో జీప్‌ని ఆబిడ్స్‌లో వున్న శేఠ్ చందన్‌లాల్ నివాసానికి దూసుకుపోనిచ్చాడు కిరణ్.

దార్లోనే శ్రీనివాస్ తన ఖాకీ దుస్తులమీద మామూలు సివిల్ దుస్తులు తొడిగేశాడు. హేట్ తీసి పక్కన పెట్టాడు. జీప్‌ని ఆబిడ్స్ పోలీస్ స్టేషన్ దగ్గర ఆపేశాడు కిరణ్. అక్కడ సిద్ధంగా ఉన్న అంబాసిడర్ కార్‌లోకి చాలా వేగంగా షిఫ్టు అయిపోయారు కిరణ్, శ్రీనివాస్‌లు—వైర్లెస్‌తో బాటు.

మరో రెండు నిమిషాల్లో కారు చందన్‌లాల్ నివాసానికి చేరుకొంది. కారుని దూరంగా పార్క్ చేసి చందన్‌లాల్ ఇంటిమీదికి దృష్టిసారించాడు కిరణ్. సెంట్రీ లిద్దరు మఫ్టీలో పాన్‌షాప్ ముందు కూచుని ఉండటం కనిపించింది.

అంటే, లోపలికి వెళ్ళిన యువకులిద్దరు ఇంకా బయటకి రాలేదన్నమాట!

శ్రీనివాస్ కిరణ్ వంక ప్రశంసాపూర్వకంగా చూశాడు—సమయానికి స్పాట్‌కి చేర్చినందుకు.

మరో అయిదు నిమిషాలకు బరువైన సూట్‌కేస్‌ను మోసుకుంటూ యిద్దరు యువకులు బయటికి రావటం, యెక్కడ్నుంచో ఓ స్పోర్ట్సు కారు దూసుకురావటం, యిద్దరు యువకులు అందులో యెక్కి కూచోవటం, స్పోర్ట్సు కారు వేగంగా నాంపల్లివైపు దూసుకుపోవటం చాలా వేగంగా జరిగిపోయాయి.

కిరణ్ ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా ఇంజన్
స్టార్టు చేసి నాంపల్లివైపు ఉరికించాడు అంబాసడర్ ని.

స్పోర్ట్సు కారు చాలా వేగంగా ఉరుకలు వేస్తూ
పోతోంది.

అప్పుడు సమయం, సాయంత్రం నాలుగున్నర గంటలు.
పట్టపగలు కోటీశ్వరుల యిళ్ళలో ప్రవేశించి అంత
ధైర్యంగా రాన్సమ్ మొత్తాల్ని రాబరీ చేస్తున్న ఈ
డెకాయిట్స్ ని చూస్తూంటే కిరణ్ శరీరం రోమాంచిత
మయింది. ఏమిటి వీళ్ళ మొండి ధైర్యం? దీన్ని వాళ్ళ
సామర్థ్యమనాలా, పోలీసుల వైఫల్యమనాలా?

స్పోర్ట్సు కారు లక్డీకాపూల్ మీదుగా సరాసరి సాగి
పోతోంది. తమ వెనుక యేదైనా వాహనంగాని, మరెవ
రైనాగాని అనుసరిస్తూన్నారో లేదో వాళ్ళు అనుమా
నించినట్టులేదు.

అమీర్ పేట్ వరకు ప్రయాణం అలా పరుగుపందెంలా
సాగిపోయింది.

కిరణ్ రియర్ వ్యూ మిర్రర్ లో సుదూరంగా పోలీస్
వాన్ అనుసరించటం గమనించి తృప్తిగా నిశ్వసించాడు.
హెడ్ క్వార్టర్స్ నించి చందన్ లాల్ యింటికి చేరుకున్న
వ్యాన్ తమని ఫాలో అవుతోంది. డెకాయిట్స్ స్థావరం
లొకేట్ చేసిన మరుక్షణం దాడి చెయ్యటానికి సర్వసన్న
ద్ధంగా వుంది రంగం.

స్పోర్ట్సు కారు యెక్కడా ఆగకుండా సంజీవరెడ్డి
నగర్ మీదుగా కూకట్ పల్లి చేరుకుంది.

అంబాసడర్ ని దానికి వందగజాల దూరంలో నడుపు
తున్నాడు కిరణ్. సుదూరంగా పోలీస్ వ్యాన్ అనుస
రిస్తోంది.

సాయంత్రం అయిదు గంటలయింది.

స్పోర్ట్సు కారు కూకట్ పల్లిలోని ఓ ఇంటిముందాగింది. కాలనీకి బాగా దూరంగా విసిరేసినట్టుందా ఇల్లు. అంబాసడర్ కాలనీ దాటి ఆ యింటివైపు యేమాత్రం సాగినా దొరికిపోతుంది.

కిరణ్ అంబాసిడర్ని కాలనీలోనే ఆపేశాడు.

"నువ్వూ, నీ సిబ్బంది నేను ఓ అరగంటలో తిరిగిరాక పోతే ఆ యింటిని ముట్టడించు!" అన్నాడు కిరణ్ కారు దిగుతూ.

శ్రీనివాస్ తలూపాడు.

ఇప్పుడు స్పోర్ట్సు కారు ఆ ఇంటి లోపలకి తీసుకుపోబడినట్టుంది, కనిపించ లేదు.

కిరణ్ మెల్లగా ఆ ఇంటివైపు నడిచాడు. చుట్టూ ప్రహారీగోడ వుంది ఎత్తుగా. స్పోర్ట్సు కారుని ఇంటి వెనకవైపుకి తీసుకుపోయినట్టు టైరు గుర్తుల్నిబట్టి పసిగట్టాడు కిరణ్.

కిరణ్ ఇంటిని సమీపించి ఓసారి చుట్టూ కలియచూశాడు. నిర్మానుష్యంగా వుంది. వెనకవైపుకి మెల్లిగా జరిగాడు. అక్కడ పోర్టికో దాన్ని అనుకుని గరాజ్ కనిపించాయి. గరాజ్ తలుపులు మూసివున్నాయి. గరాజ్ పక్కనుంచి చిన్న తలుపుంది.

కిరణ్ ఆ తలుపు దగ్గర ఆగాడు. ఆ తలుపు పెద్ద గేటు కమర్చబడినట్టు గమనించాడు ఆ గేటులోపల్నుంచి ఇల్లు ప్రారంభమైంది.

కిరణ్ రెండుక్షణాలు అక్కడే నిల్చున్నాడు. తర్వాత వెనక్కి జరిగాడు. కాంపౌండ్ వాల్ యెక్కడానికి అనువుగా నాలుగైదు బండరాళ్ళను చేర్చ

మెట్లుగా పేర్చాడు. ఆ మెట్లమీదుగా ప్రహరీ ఎక్కాడు. అవతలవైపు బయటికన్నా ఎత్తుగా వుంది. చప్పుడు కాకుండా దూకాడు.

ఒక్క క్షణం ఊపిరి బిగబట్టి గోడకి చేరగిలబడి నిల్చున్నాడు. తర్వాత అడుగులో అడుగు వేసుకుంటూ వరండా వైపు జరిగాడు.

సరిగ్గా అప్పుడే వెనకనుంచి యిద్దరు యువకులు అమాంతం అతని మీదికి దుమికి వెనకగా వాటేసుకున్నారు. కిరణ్‌ని కదలకుండా అదిమిపట్టారు. కిరణ్ కుంచించుకుపోయి వాళ్ళ మధ్యనుంచి జారిపోయాడు. ఒక్కసారిగా లేచినిల్చుని ఇద్దర్నీ రెండు చేతుల్తోను అదిమిపట్టి వాళ్ళ డొక్కల్లో తన్నాడు.

అర్భకుల్లా ఉన్న ఆ యిద్దరు నేలమీద లుంగచుట్టుకు పడిపోయారు. మళ్ళీ లేవకుండా మరోసారి పొట్టలో యెగిరి తన్నాడు కిరణ్. వాళ్ళిద్దరు లేవలేదు.

కిరణ్ మరో అరగంటవరకు వాళ్ళిద్దరు లేవరని నిర్ణయించుకుని వరండా దాటి లోపలకి నడిచాడు. అతని కెవరూ అడ్డు తగల్లేదు. అప్పుడే చీకట్లు ముసురుకుంటున్నాయి.

వరండాని చేర్చివున్న గదిలోపల్నుంచి బయటికి సన్నగా వెలుగు పడుతోంది. కిరణ్ ఆ గది పక్కకు జరిగి తలుపుకున్న కీహోల్లోంచి లోపలికి చూశాడు.

అది గదికాదు—విశాలమైన హాలు. ఆ హాల్లో పొడవాటి టేబిల్సు అమర్చబడి వున్నాయి. దాదాపు ఏభై మంది నవయువకులు కూచుని వున్నారు బల్లల చుట్టూ.

బల్లమధ్యలో అంతక్రితం ఆ ఇద్దరు యువకులు తెచ్చిన సూట్ కేస్ నించి నోట్లకట్టలు పైకితీసి లెక్కిస్తూన్నారు

నలుగురు యువకులు.

కిరణ్ ఏమాత్రం ఆలస్యం చెయ్యలేదు. తన షూ కిందినుంచి పొడవాటి ఏరియల్ రాడ్‌ని బయటికి లాగాడు. అది వైర్లెస్ సెట్‌తో కనెక్షన్ వున్న ఏరియల్. శ్రీనివాస్‌ని కాంటాక్ట్ చేసి వెంటనే ఆ ఇంటిని చుట్టుముట్టమని మెసేజ్ పంపాడు కిరణ్.

సరిగ్గా అప్పుడే అతని పక్కన శబ్దమయింది. తల తిప్పే సావకాశమివ్వకుండా నలుగురు యువకులు అతన్ని పెడరెక్కలు విరిచి పట్టుకున్నారు. హాలు తలుపులు తెరుచుకున్నాయి.

పొడవుగా దృఢంగా వున్న ఓ యువకుడు ఒక్కసారిగా కిరణ్ మీదికొచ్చాడు.

“కిరణ్ సాబ్ మీరా?” అన్నాడు ఆశ్చర్యంగా.

రివాల్వర్ అందుకునే అవకాశంకోసం తీవ్రంగా ఆలోచిస్తున్న కిరణ్ అతని వంక తనూ ఆశ్చర్యపోయి చూశాడు.

“నువ్వు నాకు ఫోన్ చేశావు కదూ, ఉదయం!” అన్నాడు కిరణ్.

“అవును సార్. మా కార్యకలాపానికి అడ్డురావద్దని మిమ్మల్ని కోరాను. నా కార్యక్రమం లక్ష్యం ఏమిటని మీరడిగారు. ఇప్పుడు మీకు చెప్పినా ఫరవాలేదు. ఎందుకంటే ముఖ్యమైన నా లక్ష్యం సిద్ధించటానికి సమయం ఆసన్నమయింది....”

“ఏమిటా లక్ష్యం?” రివాల్వర్ సంగతి కూడా విస్మరించి కుతూహలంగా అడిగాడు కిరణ్.

“కిరణ్‌గారూ! మేము దొంగలం, దోపిడీదార్లం

కాదు. విద్యాధికులైన యువకులం. ఈ వ్యవస్థమీద, ఈ పెట్టుబడిదారీ గుత్తదార్లమీద అసహ్యం పుట్టి, కష్టాల్లో వున్న వాళ్ళను, అనాథలను ఆదుకుని మాకు చేతనైన సహాయం చెయ్యాలని సంకల్పించుకున్నాం.

మేము దాదాపు వందమందిమి ఒక సంఘంగా ఏర్పడ్డాం. అనాథశరణాలయాలకు విరాళాలు ఇచ్చాం. ఆగిపోయిన ఎన్నో పెళ్ళిళ్ళను ఉద్ధరించాం.... బీదపిల్లల చదువులకు ట్రస్టులు ఏర్పరిచాం. ఏ ఆధారంలేని ఎన్నో కుటుంబాలకు ఆర్థికంగా సహాయంచేశాం.

అయితే ఇవన్నీ ఒక ఎత్తు, ప్రస్తుతం మేము తలపెట్టిన బృహత్కార్యం ఒకెత్తూ! వీటన్నిటికీ ఆర్థికంగా మాకెవరు సహాయం చేస్తారు? అందుకే ప్రజల్ని ప్రభుత్వాన్ని మోసంచేసి కోట్లు గడించిన ధనవంతుల్ని ట్రాప్ చేసి లక్షలు దోచుకున్నాం. మేం చేసింది మీ దృష్టిలో, సంఘం దృష్టిలో, చట్టం దృష్టిలో నేరమే కాదనను. కాని, మరో దారి లేదు. అందుకే ఈ నేరానికి పాల్పడ్డాం...."

"మీరు తలపెట్టిన బృహత్కార్య మేమిటి?" కిరణ్ అడ్డుతగిలాడు.

"అదే చెప్పబోతున్నాను కిరణ్ గారూ! రెండుసార్లు నెల్లూరు జిల్లాని తుఫాను రాకాసి తన కరాళ హస్తాల్లో నిర్దయగా నలిపి కాలరాచింది. దానివల్ల యెందరో జీవనోపాధి కోల్పోయారు; ప్రాణాలు కోల్పోయారు. పంటలు నష్టపోయాయి. ఇళ్ళు పోగొట్టుకుని నిరాశ్రయులయ్యారు. వీళ్ళ నాదుకోవటం మా కనీస ధర్మంగా భావించాం.

"వాళ్ళకి ఆహారపు పొట్లాలని అందించాం. రోగాలు

రాకుండా మందులు ఇప్పించాం. మంచినీటిని, కొన్నాళ్ళ వరకు ఆహారపదార్థాలని సరఫరా చేశాం. నిరాశ్రయులైన వారందరికీ ఇళ్లు కట్టించటానికి సిమెంటు, కలప, స్టీలు అన్నీ కొనుగోలు చేస్తున్నాం. దానికి పన్నెండు లక్షలు తక్కువయ్యాయి. ఇంతక్రితమే నాలుగు లక్షలు ఓ మెంబరుద్వారా నెల్లూరు పంపించాం. రాత్రికల్లా వాళ్ళకా సహాయం చేరిపోతుంది.

“ఇక మిగిలింది రేపు పంపించి ప్రస్తుతానికి దోపిడీల గురించి వాయిదా వేయాలనుకుంటున్నాను. ఇంతలో మీరు మా కార్యక్రమానికి అడ్డుతగుల్తున్నారని తెలిసి మిమ్మల్ని రిక్వెస్టు చేశాను....”

అతనేదో చెప్తున్నాడు. ఆ మధ్యాహ్నం ట్రెయిన్ క్రిందపడి ప్రాణాలు పోగొట్టుకున్న యువకుడు కిరణ్ కళ్ళలో మెదులుతున్నాడు. అయితే మద్రాసు ఎక్స్‌ప్రెస్‌లో బయల్దేరిన మెంబరు ఆ యువకుడే అయ్యుండాలి. అతని బ్రీఫ్‌లో సరిగ్గా నాలుగులక్షలున్నాయి!

కిరణ్ తన భావాల్ని ప్రకటితంకాకుండా గంభీరంగా అన్నాడు. “మిస్టర్, ఇవన్నీ చూడటానికి ప్రభుత్వముంది. తుఫాను బాధితులకి ప్రభుత్వం అన్నివిధాల సహాయం చేస్తోంది....”

ఆ యువకుడు విరగబడి నవ్వాడు.

“కిరణ్ గారూ! పేపర్లలోను, రేడియోల్లోను ప్రభుత్వం వరదబాధితులకి తుఫాను బాధితులకి సహాయం చేస్తోందని వార్తలేగాని నిజానికి వాళ్ళకి జరుగుతున్న సహాయ కార్యక్రమాలు ఏ మూలకి? వాళ్ళ కంట తిరిగే రక్తాశ్రువుల్ని యెంతవరకు తుడవగలుగుతోంది ప్రభుత్వం? పైగా నిరాశ్రయులైన అభాగ్యులు పిల్లాపాపల్తో ఎక్కడ తల

దాచుకుంటున్నారు? వాళ్ళకేది ఆశ్రయం? వాళ్ళకి రైతులకి ఒనకూడిన నష్టాన్ని యెవరు పూరిస్తూన్నారు.

"కేంద్రాన్ని సహాయంకోసం అర్థించటం, కేంద్ర బృందాలు ఎప్పుడో ఆర్నెల్లకి తుఫాను పీడిత ప్రాంతాల్ని దర్శించి, నివేదికను తయారుచేసి వాళ్ళకి సహాయాన్ని ప్రకటించి—ఇవన్నీ జరిగేదెప్పుడు సార్! ఆ అభాగ్యుల్లో మరికొంతమంది చచ్చాక!

"అందుకే సార్, మేం నడుం బిగించి రంగంలోకి దిగింది! అందుకే సార్ ఈ దోపిడీలు చేస్తూ నేరస్థులుగా ముద్రవేసుకున్నది! కేవలం మానవతా దృక్పథంతో మే మీ బృహత్కార్యంలో మా వంతు సేవ చేస్తూన్నాం. మాది తప్పయితే మనస్ఫూర్తిగా క్షమించండి సార్!"

కిరణ్ కళ్ళు చెమ్మగిల్లాయి. చుట్టూ తనవంకే చూస్తూన్న ఆ యువకుల వంక ఆత్మీయంగా ప్రేమగా చూశాడు.

"మైడియర్ యంగ్ మాన్! నీ పేరేమిటి?" అన్నాడు ఆప్యాయంగా అతని చేయి నొక్కి.

ఆ యువకుడు ఆనందంగా చిరునవ్వు నవ్వి, "మీరు మమ్మల్ని అర్థంచేసుకున్నారని మీ ఆత్మీయత చెపుతోంది. నా పేరు సతీష్. అందరూ ఏ.పి. బాంధవ్ గా వ్యవహరిస్తారు" అన్నాడు.

"ఏ.పి. బాంధవ్ అంటే....!?"

"ఆపద్బాంధవుడు" అతని పెదాలమీద అదే చెరగని చిరునవ్వు.

సరిగ్గా అప్పుడే పోలీసులతో శ్రీనివాస్ లోపలికొచ్చేశాడు.

159

కిరణ్ శ్రీనివాస్ వంక చూసి, "వీళ్ళని గాయపరచవద్దు ఇన్‌స్పెక్టర్! వీళ్ళు స్వచ్ఛందంగా లొంగిపోతున్నారు. వీళ్ళకి శిక్ష తగ్గించే బాధ్యత నువ్వు తీసుకోవాలి!" అన్నాడు.

సతీష్‌తో బాటు అందరు చేతులు ముందుకు చాచి, చిరునవ్వుతో నిల్చున్నారు. ఆ చిరునవ్వులు పసిపాప నవ్వుల్లా వున్నాయి.

—:అ యి పో యి ం ది:—